ANN తెలుగు

Follow: @ANNTELUGU

01-08-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 209 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పెట్టుబడులకు సురక్షిత రాష్ట్రం తెలంగాణ

**సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, మహా : పెట్టుబడులకు సురక్షితమైన రాష్ట్రం తెలంగాణ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సీఐఐ నార్తర్న్ రీజినల్ కౌన్సిల్ ప్రతినిధులు శుక్రవారం సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సంస్కరణల ఫలితాలను నేడు అనుభవిస్తున్నామని చెప్పారు. 1994 2004 మధ్య చంద్రబాబు కూడా పెట్టబడులను ఆకర్షించారన్నారు. "బిల్‌గేట్స్, బిల్‌క్లింటన్ వంటి దిగ్గజాలను చంద్రబాబు హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ అభివృద్ధి చెందాయి. ఫార్మా, ఐటీ రంగాలు

మిగతా 2వ పేజీలో



**టాప్ న్యూస్**

### తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ మరోసారి గడువు పొడిగింపు




- ఇంటింటి పరిశీలనకు ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తి

02

### రంగనాథ్‌ను త్వరగా బదిలీ చేయండి

- హైకోర్టు ఆదేశం
- రంగనాథ్ స్థానంలో కొత్త అధికారిని నియమించాలని సీఎస్‌కు సూచన



02

### రష్మికకు తీవ్ర గాయం

- డ్యాన్స్ చిత్రీకరణ సమయంలో..
- ప్రత్యేక రీహాబిలిటేషన్ చికిత్స అవసరమని డాక్టర్ల సూచన



02




# వైభోగమే






## ముస్తాబైన భోగాపురం విమానాశ్రయం

- ప్రధాని మోదీ చేతులమీదుగా నేడే ఆరంభం
- మీ రాక కోసం.. అంటూ మోదీకి చంద్రబాబు ఆసక్తికర స్వాగతం
- నేడు ప్రధాని మోదీ సహా ఏపీ కేబినెట్ అంతా భోగాపురంలోనే
- ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు.. గేట్ వేగా భోగాపురం

02

**అమరావతి, మహా :** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎయిర్‌పోర్ట్‌ను జాతికి అంకితం చేయనున్నారు. మొత్తం రూ.5,564 కోట్ల వ్యయంతో 2,203 ఎకరాల్లో అత్యాధునికంగా దీన్ని తీర్చిదిద్దారు. 'భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక



# సర్కారు భూమి @ రూ.200 కోట్లు...!

## అన్నోజిగూడలో భూ మాఫియా బరితెగింపు...!



- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే అక్రమార్కులకు వరం...!
- హైడ్రాకి ఫిర్యాదు చేసిన స్థానికులు...!
- మీనమేషాలు లెక్కిస్తున్న హైడ్రా...!
- చర్యలు తీసుకుంటామన్న తహసీల్దార్...!

02

ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడలో భూ మాఫియా ప్రభుత్వ భూములను తెగనమ్మి కోట్ల రూపాయలు దండుకుంది. సుమారు రూ.200 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కృష్ణారెడ్డి అనే రియల్టర్‌కు విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ రికార్డులు ఆ భూమిని ప్రభుత్వ భూమిగా స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, అప్పటి రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై క్రయవిక్రయాలకు సహకరించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 1954 సంవత్సరం నుంచే సంబంధిత రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి ప్రభుత్వ భూమిగా నమోదై ఉండగా, లంచాల మత్తులో తూగుతూ ఆనాడు విధులు నిర్వహించిన కొందరు రెవెన్యూ అధికారులు కళ్లుమూసుకుని అక్రమ లావాదేవీలకు అవకాశం కల్పించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా భావించిన కేటుగాళ్లు లింక్ డాక్యుమెంట్ల కోసం బినామీల పేర్లపై భూములను బదలాయించి అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవైపు రెవెన్యూ రికార్డులు ప్రభుత్వ భూమిగా స్పష్టంగా చూపుతుండగా, మరోవైపు ఆ భూమిపై క్రయవిక్రయాలు ఎలా జరిగాయి? అనంతరం అదే భూమిని సెక్షన్ 22ఎ కింద నిషేధిత జాబితాలో ఎలా చేర్చారు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వ భూమిగా ఉన్న భూమికి రిజిస్ట్రేషన్లు జరగడానికి కారణమైన పరిస్థితులు, అప్పటి అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో ఎవరి పేరుపై ఉంది? గతంలో ఎవరెవరి పేర్లపై క్రయవిక్రయాలు జరిగాయి? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉంది? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## ఏపీలో ప్రధాని పర్యటన

రూ.17,900 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు జాతికి అంకితం



02

## నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్

- ఫార్ములా ఈ కార్ రేసు కేసులో విచారణ
- రూ.లక్ష పూచీకత్తు సమర్పించిన కేటీఆర్
- విచారణ ఆగస్టు 25 కు వాయిదా

02



# పెద్దికి కన్నీటి వీడ్కోలు

## జనసంద్రంగా మారిన నర్సంపేట

- ఉద్యమ నేతకు కడసారి వీడ్కోలు పలికేందుకు పోటెత్తిన జనం
- అశ్రునయనాల మధ్య పెద్ది అంతిమయాత్ర
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- పార్థివ దేహానికి నివాళులు అర్పించిన కేటీఆర్, హరీష్ రావు
- అంతిమయాత్రలో కన్నీళ్ళు పెట్టుకున్న హరీష్ రావు
- సీఎం రేవంత్, కేసీఆర్ సహా నేతల దిగ్భ్రాంతి

02





## రైతులకు కేంద్రం శుభవార్త

- పీఎం-కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు
- 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు పథకం కొనసాగింపు
- ఐదేళ్ల కోసం రూ. 3.15 లక్షల కోట్ల కేటాయింపునకు ఆమోదం
- ఏటా రూ. 6,000 ఆర్థిక సాయం యథాతథంగా కొనసాగింపు
- కేంద్ర కేబినెట్ లో కీలక నిర్ణయాలు

02





# సర్కారు భూమి @రూ.200 కోట్లు...!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** మేడ్చల్-మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్, అన్నోజిగూడలో ప్రభుత్వ భూముల వ్యవహారం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఇప్పటికే సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై అక్రమ క్రయవిక్రయాలు జరిగాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారగా, తాజాగా వెలుగులోకి వస్తున్న రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. ఎన్‌కంబరెన్స్ రికార్డుల ప్రకారం 2006లో డాక్యుమెంట్ నంబర్ 0102 ద్వారా సర్వే నంబర్ 90లో 5.11 ఎకరాలు, సర్వే నంబర్ 91 లో 16 గుంటల భూమికి సంబంధించి సేల్ అగ్రిమెంట్ విత్ పొసెషన్ నమోదైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇదే భూమి రెవెన్యూ రికార్డుల్లో 22ఎ నిషేధిత జాబితాలో ఉండటం అనేక ప్రశ్నలకు కారణమవుతోంది. ఒకవైపు ప్రభుత్వ భూమిగా నమోదై ఉండగా, మరోవైపు భారీ స్థాయిలో లావాదేవీలు ఎలా జరిగాయనే అంశంపై స్థానికులు సమాధానాలు కోరుతున్నారు.




**హైడ్రా స్పందనపై అనుమానాలు..!**

ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రహదారి ఆక్రమణలపై స్థానికులు హైడ్రా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అనంతరం ఎలాంటి ఉల్లంఘనలు లేవని నివేదిక ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై వివాదాలు కొనసాగుతుండగా, హైడ్రా వ్యవహరించిన తీరుపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉన్న సర్వే నంబర్లపై ఇంత పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగినప్పటికీ, హైడ్రా ఎందుకు లోతైన విచారణ చేపట్టలేదని ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు, పత్రాలు, రెవెన్యూ రికార్డులు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం పైపై పరిశీలనతో వ్యవహారాన్ని ముగించడం వెనుక కారణాలేమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ భూమిని ప్రైవేటు ఆస్తిగా మార్చారా..?**

1954 నుంచే రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉన్నట్లు చెబుతున్న భూములపై తరువాత కాలంలో క్రయవిక్రయాలు జరగడం వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. లింక్ డాక్యుమెంట్లు లేకుండానే బినామీల పేర్లతో లావాదేవీలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రధాన రహదారిని మింగిన నిర్మాణాలు..!**

అదే ప్రాంతంలో ప్రజా వినియోగానికి ఉద్దేశించిన ప్రధాన రహదారిపై ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. హోటల్ తులిప్స్ నిర్మాణాలు రహదారి పరిమితులను దాటి ఉన్నాయనే ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది.

**చర్యలు తీసుకుంటామన్న తహసీల్దార్**

ఈ వ్యవహారంపై స్పందించిన సంబంధిత తహసీల్దార్, ఫిర్యాదులు, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి పూర్తి స్థాయి విచారణ చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భూములపై ఎలాంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించబోమని, వాస్తవాలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంబంధిత రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.

## సమగ్ర విచారణకు డిమాండ్

ప్రభుత్వ భూములుగా నమోదైన భూములపై జరిగిన లావాదేవీలు, 22ఎ జాబితాలో చేర్పు, ఎన్‌ఓసీల జారీ, రిజిస్ట్రేషన్లు, ప్రస్తుతం ఉన్న యాజమాన్య హక్కులు వంటి అంశాలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా హైడ్రా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల పాత్రను సమగ్రంగా విచారించి బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనం చేసుకుని, నిజాలను ప్రజల ముందుంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.














# పెద్దికి కన్నీటి వీడ్కోలు

**వరంగల్, మహా;** స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఓ ఉద్యమ కెరటం నేలకొరిగింది. తెలంగాణ ఉద్యమ నేత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి కడసారి వీడ్కోలు పలికేందుకు నర్సంపేట జనసంద్రంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిగా ప్రజలు, ఉద్యమ సహచరులు, రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు నర్సంపేట కు తరలివచ్చారు. ఎటు చూసినా జన సందోహమే కనిపించగా, పట్టణమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి.పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికకాయాన్ని చివరిసారి చూసేందుకు ప్రజలు బారులు తీరారు. ఆయనతో కలిసి ఉద్యమంలో నడిచిన సహచరులు, అభిమానులు, సాధారణ ప్రజలు భావోద్వేగానికి గురై కన్నీరుమున్నీరవుతున్నారు. "ప్రజల మనిషిని కోల్పోయామని ఇక మా ఉద్యమ యోధుడు ఇక లేరు" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ది మరణవార్త తెలిసిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహా నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉద్యమంలో కీలకంగా పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి కేసీఆర్ ఆదేశాలతో ఉమ్మడివరంగల్ ను ఉద్యమంలో ముందుంచేందుకు రాజీలేని పోరాటం చేశారు. ఆ సందర్భంలో అనేక గాయాలపాలయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా చరిత్రలో ఏ నాయకుడికి లభించనంత ఘన వీడ్కోలు పెద్దికి దక్కిందన్న చర్చ జరిగింది. నాడు పీజేఆర్, తర్వాత వైఎస్ ఆర్, ఇపుడు పెద్ది లాంటి నేతలకే ఇంతటి భావోద్వేగ ఘనవీడ్కోలు చూశామంటూ ప్రజలు చెప్పుకున్నారు. జీవితమంతా ప్రజలకోసం పనిచేసిన నాయకుడికి ప్రజలు నీరాజనం పలికారు. అంతిమయాత్రకు ఉమ్మడివరంగల్ జిల్లానే కాక..



వివిధ జిల్లాలకు చెందిన ఉద్యమకారులు, బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

స్వగ్రామంలోనే నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివ దేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావులు నివాళులు అర్పించారు. పెద్ది స్వగ్రామం నల్లబెల్లికి వెళ్లిన కేటీఆర్, హరీశ్ అక్కడ ఆయన కుటుంబ సభ్యులు, అశేష అభిమానుల సమక్షంలో కన్నీటి వీడ్కోలు పలికారు. పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న కేటీఆర్, హరీశ్ రావులు కంటతడి పెట్టుకున్నారు. తెలంగాన మలిదశ ఉద్యమంలో పెద్దితో కలిసి పోరాడిన రోజులు, బీఆర్ఎస్ ప్రభుత్వంలో కలిసి ఆయనతో పనిచేసిన రోజులను తలచుకున్నారు. వరంగల్ నుంచి నల్లబెల్లి వరకూ భారీ జనసందోహం నడుమ ఓ ర్యాలీలా సాగిన పెద్ది అంతిమయాత్రలో పాల్గొన్న కేటీఆర్, హరీశ్.. నల్లబెల్లిలో పెద్ది పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావులతో కలిసి కేటీఆర్ పెద్ది శవ పేటికపై బీఆర్ఎస్ జెండాను కప్పారు.

# పెట్టుబడులకు సురక్షిత రాష్ట్రం తెలంగాణ

( మొదటి పేజీ తరువాయి )

మరింత అభివృద్ధి దిశగా వెళ్లాయి. గత పాలకుల మంచి విధానాలను మేమూ కొనసాగిస్తున్నాం. నాయకులెవరైనా.. పార్టీ ఏదైనా.. మంచి ఉంటే కొనసాగిస్తాం. ఉత్పత్తి రంగంలో చైనా, జపాన్, జర్మనీతో పోటీ పడుతున్నాం. వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేంద్రం ప్రకటించిన 7 బుల్లెట్ రైళ్లలో 3 తెలంగాణకు రానున్నాయి. శంషాబాద్ నుంచి చెన్నై, పుణె, బెంగళూరుకు బుల్లెట్ రైళ్లు వెళ్తాయి. న్యూయార్క్‌తో పోటీపడే వాతావరణం తెలంగాణలో ఉంది. మా పోటీ పక్క రాష్ట్రాలతో కాదు.. టోక్యో, న్యూయార్క్ వంటి నగరాలతో. జీసీసీల్లో 200 కంపెనీలు పెట్టుబడులకు ముందుకొచ్చాయి. డేటా సెంటర్ల కోసం అమెజాన్ రూ.లక్ష కోట్లు పెడుతోంది. అదానీ గ్రూప్ రూ.35వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఫ్యూచర్ సిటీకి ప్రపంచ ప్రఖ్యాత 500 కంపెనీలను తేవడమే మా లక్ష్యం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ మరోసారి గడువు పొడిగింపు

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. వాస్తవానికి ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, హైదరాబాద్ (56.31 శాతం), రంగారెడ్డి (63.43 శాతం), మేడ్చల్‌మల్కాజ్‌గిరి (61.37 శాతం) వంటి కీలక జిల్లాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో గడువును పెంచాల్సి వచ్చింది. ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను చేపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24ను తేది గడువుగా నిర్ణయించగా, దానిని ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా మరో వారం గడువు పెంచుతూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు.

# నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్

**హైదరాబాద్, మహా :** ఫార్ములాఈ కార్ రేసింగ్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టు విచారణకు హాజరయ్యారు. ఈకేసు విచారణను ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆగస్టు 25కు వాయిదా వేసింది. ఈ కేసులో ఏ 1 గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ తోపాటు ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏ2, మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏ3 లు కూడా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో నాంపల్లి కోర్టు పరిసర ప్రాంతాల్లో పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రూ.లక్ష పూచీకత్తు కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి సమర్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ నిధుల నుంచి దాదాపు రూ.55 కోట్లను ఆర్బీఐ, కేబినెట్ ఆమోదం లేకుండా విదేశీ సంస్థకు బదిలీ చేశారనే కేసులో ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపిన ఫార్ములా ఈకార్ రేసు కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లైంది. కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కోర్టు ఆవరణకు తరలివచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో నాంపల్లి కోర్టు పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి.. కొంతసేపు ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఫార్ములాఈ రేసు నిర్వహణలో హెచ్ఎమ్‌డీఏ నిధులను అక్రమంగా వాడారని ఏసీబీ ప్రధానంగా అభియోగం మోపింది. ఫార్ములాఈ రేస్, రేసింగ్ ట్రాక్ నిర్మాణం, ఇతర అనుబంధ ఏర్పాట్ల పేరిట హెచ్ఎమ్‌డీఏ ఖజానా నుంచి రూ.55 కోట్లకు పైగా నిధులను వెచ్చించారని తెలిపింది. ఎలాంటి అధికారిక రికార్డులు పాటించకుండా ఈ ఖర్చులు చేయడం ద్వారా ఆడిట్ తనిఖీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారని ఏసీబీ పేర్కొంది. మూడు సీజన్లకు వర్తించే వ్యయాన్ని ఒకే ఒక్క రేసుకు చేసిన ఖర్చుగా చూపించి.. రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం తీసుకోకుండా నిబంధనలను పక్కన బెట్టారని పేర్కొంది.

# రష్మికకు తీవ్ర గాయం

**హైదరాబాద్, మహా :** నేషనల్ క్రష్, పాన్‌ఇండియా స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న షూటింగ్‌లో తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె రణబాలి, మైసా వంటి భారీ చిత్రాల షూటింగ్‌లలో వరుసగా పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలకు సంబంధించిన కఠినమైన యాక్షన్ సీక్వెన్సులు, విపరీతమైన డ్యాన్స్ పర్ఫార్మెన్స్‌లు చేయడం వల్ల ఆమె హిప్ ఏరియాలో టెండన్ డిటాచ్‌మెంట్ జరిగినట్లు సమాచారం. ఇటీవల ఓ డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరణ సమయంలో ఈ ప్రమాదం జరగగా, ఆమె తీవ్రమైన గాయానికి గురైనట్లు తెలుస్తోంది. సాధారణంగా అత్యంత తీవ్రంగా సాధన చేసే క్రీడాకారుల్లో మాత్రమే ఇలాంటి క్లిష్టమైన గాయాలు కనిపిస్తాయని, ఈ పరిస్థితి నుంచి కోలుకోవడానికి రష్మిక కనీసం 6 వారాల పాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని, టెండన్ మళ్లీ బలపడేందుకు ప్రత్యేక రీహాబిలిటేషన్ చికిత్స కూడా అవసరమని వైద్యులు తెలిపారు.

# రంగనాథ్‌ను త్వరగా బదిలీ చేయండి

**హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్: హైడ్రా , శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. లోతుకుంట భూముల వ్యవహారంలో ఇటీవల ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని సీఎస్‌ను హైకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమని హైకోర్టు అందులో పేర్కొంది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని తెలిపింది. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని సీఎస్‌కు సూచించింది. టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ సందర్భంగా ఉదహరించింది. చట్టపాలన మాత్రమే కొనసాగాలని.. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి మరణ శాసనం అవుతుందని పేర్కొంది.



# ఏపీలో ప్రధాని పర్యటన

**రూ.17,900 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు జాతికి అంకితం**

**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ భోగాపురం పర్యటనపై పీఎంవో అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆగస్టు 1న ఏపీ, కర్ణాటకలో మోదీ పర్యటిస్తారని తెలిపింది. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.17,900 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొంది. రూ.5,640 కోట్ల వ్యయంతో నిర్మించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభం రూ.460 కోట్లతో విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న ఆంధ్రప్రదేశ్ తొలి సెమీకండక్టర్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన ఈ ప్లాంట్‌లో ఏడాదికి సుమారు 9.6 కోట్ల (96 మిలియన్) సెమీకండక్టర్ చిప్‌లు తయారీ రూ.5,550 కోట్లతో ఏర్పాటుచేస్తున్న కర్నూలు 4 పునరుత్పాదక ఇంధన జోన్ విద్యుత్ ప్రసార వ్యవస్థ ప్రాజెక్టుకు శంకుస్థాపన కర్నూలు, అనంతపురం సోలార్ విండ్ ఎనర్జీ జోన్లకు సంబంధించిన రూ.3,550 కోట్లు, రూ.820 కోట్ల ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల ప్రారంభం రూ.1,880 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన. ఈ రహదారి ప్రాజెక్టులతో విజయవాడలో ట్రాఫిక్ రద్దీ తగ్గడం, విశాఖ హైదరాబాద్ ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రాంతీయ అనుసంధానం మెరుగుపడనుంది. అనంతరం మైసూరులో స్వామి వివేకానంద సాంస్కృతిక యువ కేంద్రంను ప్రధాని ప్రారంభించి సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.



# వైభోగమే

( మొదటి పేజీ తరువాయి )

సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఏపీ కేబినెట్ అంతా కేరాఫ్ భోగాపురం అన్నట్లుగా ఉంది. మంత్రులంతా అక్కడే కొలువుదీరడంతో అది వైభోగపురంగా మారింది. దేశంలో భోగాపురం ఓ ఆకర్షణగా మారింది. కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ ప్రాంతం వారే కావడం.. ఓ అరుదైన ఘట్టం. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు.




భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర మణిహారమని, విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్రకు పెట్టుబడులు వస్తాయని కూటమి నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని రాక సందర్భంగా 7 వేల మంది పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు.




# చిక్కుల్లో మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు

**పెళ్లి చేసుకుంటానని మోసం చేశారంటూ పోలీసులకు యువతి ఫిర్యాదు**
**కేసు నమోదు చేసిన పంజాగుట్ట పోలీసులు**
**హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే**

**హైదరాబాద్, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత రేగా కాంతారావు తీవ్ర చట్టపరమైన చిక్కుల్లో చిక్కుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు ఆర్థికంగా మోసగించారని ఓ యువతి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వెంటనే ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపగా.. రేగా కాంతారావు వెంటనే స్పందించారు. తనపై పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.
బాధితురాలు పంజాగుట్ట పోలీసులకు సమర్పించిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఉద్యోగ ఇంటర్వ్యూ సాకుతో రేగా ాంతారావు తనను ఫ్లాట్‌కు పిలిపించుకున్నారని, అక్కడే తనపై లైంగికంగా దాడి చేశారని సదరు యువతి ఆరోపించింది. ఆ ఘటన తర్వాత తన తప్పును కప్పి పుచ్చుకునేందుకు.. తనను వివాహం చేసుకుంటానని కాంతారావు మాట ఇచ్చినట్లు వెల్లడించింది. ఆ నమ్మకంతోనే తాను ఆయనతో సన్నిహిత సంబంధాన్ని కొనసాగించానని.. అయితే కాలక్రమేణా ఆ మాట తప్పి ఆయన తనను దారుణంగా మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొంది. కేవలం లైంగిక వేధింపులు, పెళ్లి పేరుతో నమ్మకద్రోహానికి పాల్పడటమే కాకుండా తన వద్ద ఉన్న సొమ్మును కూడా దోచుకున్నారని బాధితురాలు ఆరోపించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మంచి లాభాలు వస్తాయని, అందులో పెట్టుబడులు పెట్టాలనే నెపంతో తన వద్ద నుంచి భారీగా డబ్బులు తీసుకున్నారని తెలిపింది. పెళ్లి, డబ్బుల విషయాన్ని అడ్డు పెట్టుకుని.. తనను లైంగికంగా, మానసికంగా తీవ్రంగా వేధించారని వివరించింది. బాధితురాలి నుంచి అందిన పూర్తి వివరాలు, ఆధారాల ఆధారంగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.
ఇదిలా ఉండగా, బాధితురాలు పేర్కొన్న వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు స్పష్టం చేశారు. అయితే ఇది జరిగిన కాసేపటికే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పెళ్లి పేరుతో మోసం చేశానంటూ తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ తెలంగాణ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును సవాల్ చేస్తూ ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

# రైతులకు కేంద్రం శుభవార్త

- **పీఎం-కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు**
- **2030-31 ఆర్థిక సంవత్సరం వరకు పథకం కొనసాగింపు**
- **ఐదేళ్ల కోసం రూ. 3.15 లక్షల కోట్ల కేటాయింపునకు ఆమోదం**
- **ఏటా రూ. 6,000 ఆర్థిక సాయం యథాతథంగా కొనసాగింపు**
- **కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు**



**న్యూఢిల్లీ, మహా :** కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని నిర్ణయించింది. శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు.
ఈ పొడిగింపుతో పీఎంకిసాన్ పథకం 203031 ఆర్థిక సంవత్సరం వరకు అమల్లో ఉండనుంది. ఇందుకోసం రాబోయే ఐదేళ్లకు గానూ రూ. 3,15,614 కోట్లను కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 6,000 ఆర్థిక సాయం అందుతున్న విషయం విదితమే. ఈ మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో, అంటే ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ. 2,000 చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా నేరుగా ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. రైతులకు కనీస ఆదాయ భరోసా కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న ఈ పథకాన్ని ప్రారంభించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక మద్దతు నిరంతరాయంగా కొనసాగనుంది. మరోవైపు, రాబోయే ఐదేళ్లలో 5,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ. 5,070 కోట్లను కేటాయించింది. అలాగే, ఖేల్ ఇండియా పథకానికి రూ. 29 వేల కోట్లు, సముద్ర మంథన్ ప్రాజెక్టుకు రూ. 84 వేల కోట్లు, సొరంగాల నిర్మాణం కోసం రూ. 9,779 కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది.

**ఖేలో ఇండియా, సముద్ర మంథన్‌లకు భారీ నిధులు**

దీంతో పాటు క్రీడారంగం, సముద్ర ఇంధన అన్వేషణ రంగానికి సంబంధించి రూ. 4.35 లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌తో చేపట్టిన పలు కీలక పథకాలకు ఆమోదముద్ర వేసింది.
స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక క్రీడాభివృద్ధి కార్యక్రమంగా రూపుదిద్దుకున్న 'ఖేలో ఇండియా' విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఖేలో ఇండియా పథకంతో పాటు జాతీయ క్రీడా సమాఖ్యలకు అందించే సహాయాన్ని కలిపి మొత్తం రూ. 36,441 కోట్లు కేటాయించారు. ఇందులో ఖేలో ఇండియా పథకానికి రాబోయే ఐదేళ్లకు గాను రూ. 29,054 కోట్లు కేటాయించారు. ఇది మునుపటి బడ్జెట్ కంటే దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ. 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ, 2036 ఒలింపిక్స్ వేలం దిశగా అడుగులు వేస్తున్న భారత్, క్రీడల్లో ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు ఈ నిధులు తోడ్పడనున్నాయి. అలాగే జాతీయ క్రీడా సమాఖ్యలకు ఐదేళ్ల వ్యవధిలో రూ. 7,387 కోట్ల సాయం అందించనున్నారు.

**'సముద్ర మంథన్'తో ఇంధన రంగంలో విప్లవం**

దేశీయంగా చమురు, సహజ వాయువు ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'సముద్ర మంథన్' (నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ స్కీమ్) ప్రారంభానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 203031 ఆర్థిక సంవత్సరం వరకు అమలు కానున్న ఈ పథకానికి రూ. 84,084 కోట్లు కేటాయించారు. ఈ పథకం ద్వారా సముద్ర తీర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ నిల్వల అన్వేషణను వేగవంతం చేస్తారు. 600 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆయిల్ ఈక్వివలెంట్ (MMTOE) కంటే ఎక్కువ నిల్వలను కనుగొనాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల దిగుమతులపై ఆధారపడటం తగ్గడమే కాకుండా ఇంధన రంగంలో భారీగా కొత్త ఉద్యోగాలు, పెట్టుబడులు తరలివచ్చే అవకాశముంది.

**పీఎంఎస్ఎస్ వైకి ఆమోదం**

నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లు: రూ.5,070 కోట్లతో 'పీఎం సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన' పథకానికి ఆమోదం తెలిపింది. రూ.5,070 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పథకం ద్వారా నీటిపై తేలియాడే (ఫ్లోటింగ్) సోలార్ ప్లాంట్ల సాయంతో 5,000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టుల వద్దే విద్యుత్‌ను నిల్వ చేసే వ్యవస్థలను కూడా అనుసంధానించనున్నారు. ఈ పథకం కింద కనీసం రెండు గంటల పాటు విద్యుత్‌ను నిల్వ ఉంచేలా (మొత్తంగా 10,000 ఎండబ్ల్యూహెచ్) సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తారు. 202627 నుంచి 203031 ఆర్థిక సంవత్సరాల మధ్య ఈ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయనుండగా, 203233 వరకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. ప్రస్తుతం దేశంలో తేలియాడే సోలార్ ప్లాంట్ల సామర్థ్యం కేవలం 700 మెగావాట్లు మాత్రమే ఉండగా, ప్రాజెక్టులు, జలాశయాల్లో దాదాపు 102.18 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలున్నాయని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ స్పష్టం చేసింది.

# ఆగస్టు చివరి వారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు శ్రీకారం

- **మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తి**
- **ఆధార్ ఒక్కటే కాదు.. నివాస ధృవీకరణకు పలు పత్రాలు చెల్లుబాటు**
- **ఇల్లు రాకపోతే రూ. 10 వేల ఈఎండీ తిరిగి చెల్లింపు**
- **దరఖాస్తులకు ఆగస్టు 10 చివరి తేదీ**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ టవర్స్ పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది పూర్తి కాగానే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలోని క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు పూర్తయిందని, దశలవారీగా మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని విస్తరిస్తామని చెప్పారు. పేద కుటుంబాలు కూడా హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తే కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, ప్రస్తుతం భారీగా వస్తున్న దరఖాస్తులే ఇందిరమ్మ టవర్స్‌పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల కేటాయింపు, నిర్మాణం చేపడుతున్నామని, అందువల్ల ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తుదారులు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని మంత్రి తెలిపారు. దీంతో ప్రజలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుల గడువును ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ఆలోచన లేదని, ఆగస్టు 10లోపు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇంటి కోసం చెల్లించే రూ.10 వేల ఈఎండీ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత లభించని వారికి వంద శాతం మొత్తం తిరిగి చెల్లిస్తామని మరోసారి స్పష్టం చేశారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈఎండీ చెల్లిస్తే, అదే బ్యాంకు ఖాతాకు నేరుగా రీఫండ్ జమ అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో పారదర్శకత, బాధ్యతతో ముందుకు సాగుతుందని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు జరిగేలా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తోందన్నారు. ఎవరి పట్లా కక్షపూరిత వైఖరి లేకుండా, సామాన్య ప్రజలు హర్షించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే ప్రభుత్వం చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు.



# కంకర రాళ్లకు బంగారం పూత పూసి మోసం

**బాకీ తీర్చాలని కోరితే బంగారం పూత పూసిన కంకర రాళ్లు ఇచ్చిన వైనం**
**నిజామాబాద్ పట్టణంలో ఘటన**

నిజామాబాద్, మహా : బాకీ తీర్చాలని కోరితే కంకర రాళ్లకు బంగారం పూత పూసి ఇచ్చిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. నిజామాబాద్ నగరంలోని హమాల్ వాడీకి చెందిన రమేష్ వద్ద శఅరీనిలాస్ అనే వ్యక్తి రూ.1.30 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చాలని శ్రీనివాస్ పై రమేష్ ఒత్తిడి తెచ్చాడు. దాంతో తనకు గుప్తనిధులు దొరికాయని, అందులో బంగారం రాళ్లు ఉన్నాయని చెప్పిన శ్రీనివాస్ బంగారు రాళ్లను అప్పు కింద కట్టుకోమని రమేష్‌ను నమ్మించాడు. నిజామాబాద్‌లో కాకుండా డిచ్‌పల్లి మండలం ఘన్ పూర్ కి అదనంగా రూ. 32 వేలు తీసుకొని రావాలని రమేష్‌కు శ్రీనివాస్ సూచించాడు. నాలుగు కుండల్లో నాలుగు బంగారం రాళ్లను రమేష్‌కు శ్రీనివాస్ అందించాడు. అనుమానం వచ్చి చూడగా.. కంకర రాళ్లకు బంగారం రంగు పూత పూసినట్లు బాధితుడు రమేష్ గుర్తించి, మోసపోయానని గ్రహించి డిచ్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## కృష్ణమ్మ గల గల

**అలమట్టి గేట్లు ఎత్తిన అధికారులు**
**శ్రీశైలం జలాశయానికి భారీ వర**

**కర్నూలు, మహా :** కృష్ణానది ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం ఎగువనున్న ప్రాజెక్టులన్ని నిండుకుండలా మారాయి. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆలమట్టి డ్యాం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దాంతో నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో శ్రీశైలం జలాశయానికి భారీ వరద ప్రవాహం పెరుగుతుంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి ఒక లక్ష క్యూసెక్కులకు నీరు నేరుగా చేరుతుంది. ఆల్మట్టి డ్యామ్ నుంచి 90 వేల క్యూసెక్కుల నీరు, భీమా నది నుంచి పదివేల క్యూసెక్కుల నీళ్లు కృష్ణా నదిలోకి వదులుతున్నారు. జూరాల జల విద్యుత్ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. దాంతో శ్రీశైలం జలాశయానికి ఒక లక్ష క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. మరో నాలుగు, ఐదు రోజులు భారీ వర్షాలు కురిస్తే శ్రీశైలం జలాశయానికి రెండు నుంచి మూడు లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉంది. శ్రీశైలం జలాశంలోకి భారీగా వరద నీరు చేరడంతో విద్యుత్ ఉత్పత్తి చేస్తే నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరే అవకాశం ఉంది.






# జీపీడీపీ ప్రణాళికలను పటిష్టంగా రూపొందించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

హనుమకొండ, మహా; 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామ, మండల, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమగ్రంగా పటిష్ట ప్రణాళికలను రూపొందించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రణాళికల రూపకల్పన పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వ శిక్షా అభియాన్, వ్యవసాయ, సంక్షేమ, వైద్యారోగ్య, విద్యుత్, గ్రామీణాభివృద్ధి (డీఆర్‌డీఓ), మత్స్య, అటవీ, పౌర సరఫరాలు, పశుసంవర్ధక, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, విద్య, రెవెన్యూ తదితర శాఖలు తమ 2026-27 కార్యాచరణ ప్రణాళికలు, అమలులో ఉన్న పథకాలు, ప్రతిపాదిత పనులు, అందుబాటులో ఉన్న వనరులు, లబ్ధిదారుల వివరాలు, నిధుల వినియోగం తదితర సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేసి జీపీడీపీ ప్రణాళికల్లో పొందు పరచాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు గ్రామసభలు, మండల స్థాయి సమావేశాల్లో తప్పనిసరిగా పాల్గొని ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని, శాఖల మధ్య సమన్వయంతో గ్రామాభివృద్ధికి ఉపయోగపడే కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్వో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యం

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర వికాసానికి మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని హేమచంద్రపురం అనిశెట్టిపల్లి గ్రామాల మధ్య గల ముర్రేడు వాగుపై రూ.7.00 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రేగళ్ల ప్రాంతంలోని మున్యాతండా పెద్దతండా గ్రామాల మధ్య గంగమ్మగుడి వాగుపై రూ.1.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబోయే మరో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామీణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడం గ్రామాల మధ్య అనుసంధానాన్ని పెంచడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే మారుమూల గ్రామీణ ఏజెన్సీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వంతో పోరాడి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల సమీకరణలో ఎక్కడా రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఈ వంతెనల నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు సత్వర రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపిడివో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, ఎంపిడివో సుస్మిత, తహశీల్దార్ శిరీష, అధికారులు రఘురామయ్యా, శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, రత్నకుమారి, సర్పంచులు అంజలి, పూర్ణ, హతిరామ్, వీరబాబు, దేవరగట్ల రాంబాబు, సపావట్ రవి, జర్పుల ఉపేందర్, గోవిందు, వెంకటనర్సయ్య, సత్యనారాయణ, ఎల్లావుల ఉపేందర్, బైకాని కృష్ణ, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



# రిటైర్డ్ అధికారులకు ఆత్మీయ సన్మానం

**కొత్తగూడెం, జూలై 31 (మహా న్యూస్):** సింగరేణి సంస్థకు విశేష సేవలందించిన జీఎం (పర్సనల్) కవితా నాయుడు, డీజీఎం (పర్సనల్) కేసా నారాయణరావు పదవీ విరమణ సందర్భంగా పర్సనల్ విభాగం శుక్రవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించింది. 36 ఏళ్లకు పైగా అంకితభావంతో సేవలందించిన వారి కృషిని అధికారులు కొనియాడారు. సంస్థ అభివృద్ధి, పారిశ్రామిక సంబంధాల నిర్వహణలో వారి సేవలు అభినందనీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు జనరల్ మేనేజర్లు, అధికారులు, పర్సనల్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## డబ్బు కాజేసిన ఇద్దరి అరెస్టు

**కారేపల్లి, జూలై 31 (మహా న్యూస్):** మనీగోల్డ్ సంస్థ ప్రతినిధి వద్ద రూ.5.80 లక్షలు దోచుకున్న ఇద్దరు నిందితులను కారేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సింగరేణి సీఐ ఎన్. సాగర్ తెలిపిన వివరాల ప్రకారం, నకిలీ బంగారం తాకట్టు వ్యవహారానికి సంబంధించిన వివాదంలో ఈ దోపిడీ జరిగింది. నిందితుల వద్ద నుంచి వెర్నా కారు, మొబైల్ ఫోన్, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, నకిలీ బంగారం చలామణిపై దర్యాప్తు కొనసాగుతోందని సీఐ వెల్లడించారు

ANN తెలుగు

మహా పత్రిక

శనివారం, హైదరాబాద్

01-08-2026

మహా ప్రత్యేకం



# భోగాపురం.. మూడు రాష్ట్రాలకు వరం



- ఏపీ చరిత్రలో సరికొత్త అధ్యాయం
- దక్షిణ ఒడిశాకు అత్యంత చేరువగా..
- ఛత్తీస్ గఢ్ కు గేట్ వే
- 2200 ఎకరాల విస్తీర్ణంలో.. అద్భుతం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్

(మహా ప్రత్యేకం)

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో శనివారం సరికొత్త అధ్యాయం మొదలుకాబోతుంది. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అధికారికంగా జాతికి అంకితం కాబోతోంది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ, ఈ ప్రాజెక్టు ప్రాధాన్యత కేవలం ఏపీ సరిహద్దులకే పరిమితం కాలేదు. భౌగోళికంగా ఇది అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతంలో నిర్మాణం కావడంతో పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఆర్థిక, పారిశ్రామిక, ప్రయాణ అవసరాలకు ప్రధాన కేంద్రంగా మారనుంది. ఇండియాలో ఒకేసారి మూడు రాష్ట్రాల పారిశ్రామిక రంగాన్ని ఇంటర్నేషనల్ మార్కెట్‌తో అనుసంధానించే ఏకైక ఏరోహబ్‌గా భోగాపురం చరిత్ర సృష్టించబోతోంది.

2200 ఎకరాల విస్తీర్ణంలో..

జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దాదాపు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయం రూపుదిద్దుకుంది. మొదటి దశలోనే ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా, 3.8 కిలోమీటర్ల పొడవైన అత్యాధునిక రన్‌వేతో దీనిని తీర్చిదిద్దారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రయాణికుల సామర్థ్యాన్ని 4 కోట్లకు పెంచేలా ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద పాసెంజర్ విమానమైన ఎయిర్‌బస్ A380 వంటి వైడ్‌బాడీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు సైతం ఇక్కడ ఈజీగా ల్యాండ్ కాగలవు. అంతేకాకుండా, సరుకు రవాణాను సులభతరం చేసేందుకు ఇక్కడ నిర్మించిన మల్టీ మోడల్ కార్గో హబ్ ఈ ప్రాంతపు ఎగుమతులకు సరికొత్త వేగం అందించనుంది

ఛత్తీస్ గడ్ కు గేట్ వే

సముద్ర తీరం లేని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి భోగాపురం విమానాశ్రయం అత్యంత వేగవంతమైన అంతర్జాతీయ గేట్‌వేగా మారుతుంది. ముఖ్యంగా దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పూర్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ రోడ్డు మార్గంలో కేవలం 270 నుండి 290 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ, సుక్మా, కొండగావ్, రాయ్‌పూర్ జిల్లాల ప్రజలు, పారిశ్రామికవేత్తలు ఇకపై సులభంగా విదేశీ సర్వీసులను అందుకోవచ్చు. ఇప్పటివరకు ఈ ప్రాంతవాసులు ఏకైక రాజధాని ఎయిర్‌పోర్ట్‌పై, ఢిల్లీముంబైలపై ఆధారపడాల్సి రాగా, ఇకపై 56 గంటల్లో నేరుగా భోగాపురం చేరుకుని గల్ఫ్, ఆగ్నేయాసియా మరియు యూరప్ దేశాలకు ప్రయాణించవచ్చు. అలాగే బస్తర్ రీజియన్‌లోని ఖనిజ ఉత్పత్తుల ఎయిర్ కార్గో రవాణాకు భోగాపురం కీలకంగా మారనుంది.

ఒడిస్సాకు వరం

ఒడిశా రాజధాని భువనేశ్వర్ విమానాశ్రయం ఆ రాష్ట్ర ఉత్తర, మధ్య జిల్లాలకు అందుబాటులో ఉన్నప్పటికీ, దక్షిణ ఒడిశా ప్రజలకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అత్యంత చేరువగా ఉంటుంది. ప్రధానంగా ఒడిశాలోని కొరాపుట్, రాయగడ, గంజాం, బరంపూర్, మల్కాన్‌గిరి, నాబరంగ్‌పూర్, గజపతి జిల్లాలకు భోగాపురం అత్యంత సమీపంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్. రాయగడ లేదా కొరాపుట్ నుంచి భువనేశ్వర్ చేరుకోవడానికి 8 నుండి 10 గంటల సమయం పడితే, జాతీయ రహదారి మీదుగా భోగాపురానికి కేవలం 3 నుండి 4 గంటల్లో చేరుకోవచ్చు. దక్షిణ ఒడిశాలోని అల్యూమినియం, మైనింగ్, పేపర్ పరిశ్రమలకు, సామాన్య ప్రయాణికులకు ఈ ఎయిర్‌పోర్టు ఎంతో మేలు చేయనుంది. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ఛత్తీస్‌గఢ్, ఒడిశాల సరిహద్దు జిల్లాల రూపురేఖలు మారబోతున్నాయి. దుబాయ్, సింగపూర్, మలేషియా, థాయిలాండ్ వంటి ప్రముఖ అంతర్జాతీయ గమ్యస్థానాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కానుండటంతో విదేశీ పెట్టుబడులు ఈ మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు వెల్లువెత్తే అవకాశం ఉంది. వ్యాపార కనెక్టివిటీతో పాటు, విదేశీ పర్యాటకులు అరకు, లంబసింగితో పాటు దక్షిణ ఒడిశాలోని కొరాపుట్ వ్యాలీ, బస్తర్ లోని ప్రకృతి అందాలను సందర్శించడానికి సులువవుతుంది. ఫలితంగా లాజిస్టిక్స్, ఆతిథ్య రంగం, ట్రావెల్ ఇండస్ట్రీలలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభించి, మూడు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు భోగాపురం పవర్ హౌస్‌గా నిలవనుంది.





## భారత్ లో అద్భుతం.. భోగాపురం

విజయనగరం జిల్లా భోగాపురంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ‘అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం’ ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి కావడం విశేషం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులతో ఇది రూపుదిద్దుకుంది. ఉత్తరాంధ్ర ప్రజల ఆశలను నెరవేరుస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఇదొక సువర్ణాధ్యాయంగా మారుతోంది. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సులభతర ప్రయాణం కోసం 40 చెక్‌ఇన్ కౌంటర్లు, 12 డిగ్రీ యాత్ర పాడ్స్, సెల్ఫ్‌సర్వీస్ బ్యాగేజ్ డ్రాప్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. భద్రత కోసం అధునాతన స్క్రీనింగ్ వ్యవస్థలు, ఇమ్మిగ్రేషన్, ఎమిగ్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల షాపింగ్, వినోదం కోసం కమర్షియల్ స్పేస్‌లు, రిటైల్ స్టోర్లు, ఫుడ్ అండ్ బెవరేజ్ అవుట్ లెట్లు కొలువుదీరనున్నాయి. తుఫానులను సైతం తట్టుకునేలా గంటకు 275 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులను సైతం నిరోధించే సైక్లోన్‌రెసిస్టెంట్ డిజైన్‌తో దీన్ని నిర్మించారు.

**ఉత్తరాంధ్ర ప్రగతికి గ్రోత్ ఇంజన్**

ఆర్థికాభివృద్ధికి ఇది ఓ గ్రోత్ ఇంజిన్ కానుంది. ఆసియాలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మహా నగరం విశాఖపట్నం. ఇక్కడ నుంచి అల్లూరి విమానాశ్రయానికి అనుసంధానాన్ని మెరుగుపరచడానికి చేపట్టిన రోడ్డు, ప్రాజెక్టులు దాదాపు పూర్తయ్యాయి. ఈ విమానాశ్రయం పర్యాటకం, రవాణా రంగాలతో పాటు వ్యవసాయ, సముద్ర ఉత్పత్తులు, పారిశ్రామిక ఎగుమతులకు ప్రధాన ఉత్ప్రేరకంగా మారుతుందని భావిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి రంగానికి మరింత ఊపు రానుంది. విమానాశ్రయంతో పాటు జీఎంఆర్ ఏరో సిటీ పరిధిలో హోటళ్లు, వాణిజ్య కేంద్రాలు, వినోద జోన్లు రూపుదిద్దుకుంటున్నాయి. ఎయిర్ పోర్టులో ఏవియేషన్, ఏరోస్పేస్ రంగానికి ప్రత్యేకంగా 500 ఎకరాలు కేటాయించగా, భీమిలి మండలం అన్నవరంలో జీఎంఆర్ - మాన్సాస్ ఎడ్యుసిటీ ద్వారా పైలట్లు, ఏరోస్పేస్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు**

స్థానిక యువత ఉపాధి కోసం వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఎయిర్ బస్, బోయింగ్ వంటి భారీ విమానాలు సైతం ల్యాండ్ అయ్యేలా 3,800 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో ‘క్యాట్‌ఐ’ రన్ వే సిద్ధం చేశారు. సుమారు 79,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, రెండు అంతస్తులుగా విశాలమైన ప్యాసింజర్ టెర్మినల్ నిర్మించారు. మొదటి దశలో ఏటా 6 మిలియన్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండగా, రాబోయే రోజుల్లో 18 మిలియన్లకు విస్తరించాలని ప్రణాళికలు రూపొందించారు. ఈ విమానాశ్రయ నిర్మాణం తీర ప్రాంత విశిష్టతను చాటేలా ‘ఎగిరే చేప’ ఆకృతిలో ప్రేరణ పొందింది. టెర్మినల్ పైకప్పు సాంప్రదాయ ‘శ్రీగ్రామ్’ థీమ్ ఆర్ట్స్ ఆకట్టుకునేలా ఉంది. 55 మీటర్ల ఎత్తులో, 360 డిగ్రీల నిహంగ నీక్షణ సేవలు అందించేలా ఎంటీసీ టవర్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 5,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటైన కార్గో టెర్మినల్ ద్వారా వార్షికంగా 25,000 టన్నుల వస్తువులను నిర్వహించవచ్చు.







# అక్రమాల అడ్డా కుషాయిగూడ కూరగాయల మార్కెట్

- **విజిలెన్స్ విచారణకు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి**

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో షాపుల అక్రమ బదిలీలు, అనధికార వ్యాపారాలు, రైతుల వద్ద అక్రమ వసూళ్లు, భారీ అద్దె బకాయిలు, విద్యుత్ బిల్లుల బకాయిలపై సమగ్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కాప్రా సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించింది. మార్కెట్‌లో మొత్తం 219 షాపులు ఉండగా, వాటిలో 149 కూరగాయల షాపులు ఉన్నాయని, వీటిలో ప్రస్తుతం కేవలం 30 మంది మాత్రమే అసలు అలాట్‌మెంట్ పొందిన లబ్ధిదారులు కొనసాగుతున్నారని, మిగిలిన 119 షాపులు అక్రమంగా ఇతరులకు విక్రయించబడినట్లు ఆరోపించింది. ప్రస్తుతం ఒక్కో షాపు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చేతులు మారుతున్నట్లు తెలిపింది. కొందరు వ్యక్తులు 3 నుంచి 10 షాపుల వరకు తమ ఆధీనంలో ఉంచుకుని అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నట్లు పేర్కొంది. కూరగాయల వ్యాపారం కోసం కేటాయించిన షాపుల్లో కొన్నింటిలో రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, సెటిల్‌మెంట్ వంటి అనధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపింది. అలాగే మార్కెట్‌కు వచ్చే రైతుల వద్ద ప్రతిరోజూ రూ.10 నుంచి రూ.20 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపించింది. మార్కెట్‌లో సుమారు రూ.8 కోట్ల అద్దె బకాయిలు, రూ.2 కోట్లకు పైగా విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం ఉందని, దీనిపై ప్రత్యేక విచారణ జరిపించి ప్రభుత్వానికి జరిగిన ఆదాయ నష్టాన్ని అంచనా వేయాలని కోరింది. అక్రమంగా బదిలీ చేసిన షాపుల అలాట్‌మెంట్‌లను రద్దు చేసి, ఒకరి పేరుపై ఒకటి కంటే ఎక్కువ షాపులు ఉన్నట్లయితే వాటిని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అలాగే ఖాళీ అయ్యే షాపులను పారదర్శక విధానంలో స్థానిక పేద నిరుద్యోగ యువతకు కేటాయించాలని, రైతుల వద్ద జరుగుతున్న అక్రమ వసూళ్లపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ అంశాలన్నింటిపై విజిలెన్స్ విభాగం ద్వారా సమగ్ర విచారణ నిర్వహించాలని వినతిపత్రంలో డిమాండ్ చేసింది. వినతిపత్రం సమర్పించిన వారిలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య వెంకటేశ్వర్లు, పండాల గణేష్ గౌడ్, దయానంద్, పిట్టల రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

# అయ్యప్పస్వామి ఆలయ ముందు పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

- **ఏళ్ల తరబడి ప్రజలకు నరకయాతన**
- **అధికారుల అలసత్వంపై మండిపడుతున్న కాలనీ వాసులు**



**కుషాయిగూడ, మహా :** కమలానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో డ్రైనేజీ సమస్య ఏళ్లుగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ముందు ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో మురుగు నీరు నిత్యం రోడ్డుపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యను పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు, పాఠశాల విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు ప్రతిరోజూ మురుగు నీటిలోనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆలయం ముందు రహదారి పూర్తిగా మురుగు నీటితో నిండిపోయి చెరువును తలపించే పరిస్థితి ఏర్పడుతోంది. తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విపరీతంగా పెరిగి ప్రజారోగ్యానికి ప్రాణాంతకముగా మారిందంటున్నారు. ఇదిలా ఉండగా, కాలనీలోని పార్కుల అభివృద్ధి వంటి పనుల కోసం లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్న అధికారులు ప్రజలకు అత్యవసరమైన డ్రైనేజీ సమస్యను మాత్రం విస్మరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతర పనులపై దృష్టి సారించడం సమంజసం కాదంటున్నారు.




# అనుమానాస్పద కదలిక వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

- **కుషాయిగూడ ఇన్స్పెక్టర్ లెంకల భాస్కర్ రెడ్డి**
- **మీ సురక్ష పై కాలనీ వాసులకు అవగాహన**

**కుషాయిగూడ, మహా :** కాలనీలలో అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజల రక్షణే మా బాధ్యతగా విదులు నిర్వర్తిస్తున్నామని కుషాయిగూడ ఇన్స్పెక్టర్ లెంకల భాస్కర్ రెడ్డి అన్నారు. శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ లో గురువారం రాత్రి మీ సురక్ష కార్యక్రమం లో భాగంగా సైబర్ నేరాల నివారణ, మహిళలు అనుమానస్పద వ్యక్తులపై జాగ్రత్తలు తదితర అంశాలపై కాలనీ అధ్యక్షులు జె సుధాకర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా ఇన్స్పెక్టర్ లెంకల భాస్కర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇండ్లలో పని చేసే పని మనుషులు, ఇండ్లలో అద్దెకు ఉండే వారి పూర్తి సమాచారం ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, తీసుకొని జాగ్రత్త వహించాలని, ఇటీవల కాలంలో పనిమనిషి రూపంలో ఇళ్లల్లోకి ప్రవేశించి చోరీలు మోసాల సంఘటనలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలు, ఇండ్లల్లో చోరీలు, మోసాలు లాంటి వాటిపై అప్రమత్తం గా ఉంటూ కాలనీలోని ప్రజలు పోలీసులతో సమన్వయం పెంచుకొని, ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సీనియర్ జర్నలిస్ట్ జనసేవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దామరపల్లి నర్సింహారెడ్డి కాలనీలోని మహిళలు, సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

# రాజుపేట సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

**మణుగూరు, జూలై 31 (మహా న్యూస్):** మణుగూరు పట్టణంలోని రాజుపేట గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన గ్రామస్తులు, మౌలిక వసతుల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి జులై 31 మహా :** విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని , విద్యార్థులకు మంచి రుచి కరమై పోషకాహారం అందించాలని , నాణ్యమైన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శుక్రవారం తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల (కేజీబీవీ), పీఎం శ్రీ మోడల్ స్కూల్ & కాలేజీ, మండల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా కేజీబీవీని సందర్శించిన కలెక్టర్, పాఠశాలలో మొత్తం ఎంత మంది విద్యార్థుల ఉన్నారని , గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయా అనే వివరాలను అడిగి సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నరని,వారంతా క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా అనే అంశాలపై ఆరా తీశారు.
అనంతరం కలెక్టర్ కిచెన్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించా రు వంటచేసే గది పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కూరగాయలను పరిశీలించారు,తాజాగా ఉన్న కూరగాయలనే వాడాలన్నారు , గుడ్లు, వంటనూనె ప్యాకెట్ల గడువు తేదీలను పరిశీలించి, నాణ్యమైన ఆహార పదార్థాలనే వినియోగించాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లడుతూ ప్రతి రోజు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, ఈ వారంలో చికెన్ పెట్టడం జరిగిందా అని,భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బీఎస్‌కే బృందం ఈ విద్యా సంవత్సరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించిరా అని అడిగి తెలుసుకున్నారు, రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థినీల వివరాలను అడిగితెలుసుకున్నారు. వారితో నేరుగా మాట్లాడి ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అటువంటి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.తదుపరి పీఎం శ్రీ మోడల్ స్కూల్ & కాలేజీని సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య, హాస్టల్, విద్యా భవనాల నిర్వహణనుపరిశీలించారు. మరుగుదొడ్లు ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నారా, తగినంత నీటి సరఫరా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఆర్‌బీఎస్‌కే బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించలేదని తెలుసుకుని వెంటనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.కేజీబీవీ, మోడల్ స్కూల్ & కాలేజీలలో 14 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి బాలికకు 100 శాతం టీకా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని (డీఈఓ) ఆదేశించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల హాజరు, పోషకాహార కార్యక్రమాలను పరిశీలించారు. సామ్ , మామ్ కేటగిరీల్లో ఉన్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకుని, మామ్ పిల్లలకు అందిస్తున్న ప్రత్యేక పోషకాహారం గురించి ఆరా తీశారు.చిన్నారులకు బోధిస్తున్న ప్రీస్కూల్కార్యకలాపాలు, ఆట వస్తువులు, బాలామృతం ప్లస్, పాల ప్యాకెట్ల గడువు తేదీలను పరిశీలించి నాణ్యతపై రాజీ పడొద్దని సూచించారు.చివరిగా మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య, ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలు, గ్రామంలో పాఠశాల వయస్సు పిల్లల సంఖ్యపై ఆరా తీశారు. ప్రతి అర్హ బాలుడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణకు తీరని లోటు

- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన ఉద్యమం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయన అందించిన సేవలు తెలంగాణ సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. పెద్ది మృతి తెలంగాణకు తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. తెలంగాణ నవ సమాజం ఉన్నంతవరకు పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడని ఎమ్మెల్యే కొనియాడారు.




# జనంపల్లి రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీని పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి భువనగిరి జులై 31 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ , కళాశాలను శుక్రవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సందర్శించారు
ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు తదితరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. వసతి గృహాలు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని అధికారులకుసూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్ ఏఈ, గృహనిర్మాణ శాఖ ఏఈలతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న పనుల పురోగతి, పెండింగ్ పనులు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
అనంతరం అదనపు కలెక్టర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, విధులకు హాజరవుతున్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఏఈలు ఆశిష్ రాఘవ, సందీప్, సురేష్, పంచాయతీ కార్యదర్శులు సైదిరెడ్డి, అయ్యప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.!

- **మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత**
- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక**



**ఇబ్రహీంపట్నం జూలై 31 మహా:** పర్యావరణ పరిరక్షణలో మొక్కలను నాటి వాటిని సంరక్షించడం అత్యంత కీలకమైన అంశమని, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక అన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్. రమేష్ నాయకత్వంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశంలో అటవీ విస్తీర్ణం నానాటికీ తగ్గిపోవడానికి ఆధునిక జీవనశైలి, పట్టణీకరణ ప్రధాన కారణాలని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనడమే కాకుండా, సమాజంలో మొక్కల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందుండాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్. రమేష్ మాట్లాడుతూ... తమ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఒక మొక్క సంరక్షణ బాధ్యతను అప్పగించామని, ఆ మొక్క ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేష్, అధ్యాపకులు శ్రీకృష్ణ, డాక్టర్ సి.వి. పవన్ కుమార్, రవికుమార్, నీలిమ, డి.వి. రావు, రచన, రాకేష్ భవాని, మాధవి, కరుణ, సురేష్, ఉదయరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి దోపిడీ కేసులో కుటుంబ సభ్యులే సూత్రధారులు.. సంచలన కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు

- **బాధితుడి అల్లుడు, మనవడే మాస్టర్‌మైండ్లు**
- **మీరట్‌లో ముగ్గురు నిందితుల అరెస్ట్.. నగదు, బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం**
- **సీసీటీవీ, డిజిటల్ ఆధారాలతో ఛేదించిన పోలీసులు**




**కరీంనగర్, మహా :** కరీంనగర్ భగత్‌నగర్‌లో ఇటీవల జరిగిన సంచలనాత్మక ఇంటి దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ ఇంట్లో జూలై 21/22 అర్ధరాత్రి జరిగిన ఈ దోపిడీకి బాధితుడి అల్లుడు మొహమ్మద్ రజావుద్దీన్ (A1), మనవడు మొహమ్మద్ అజీమ్ రజా (A2) ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. వీరు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మరో ముగ్గురు సహచరులతో కలిసి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.దర్యాప్తులో భాగంగా మీరట్‌లో ప్రత్యేక గాలింపు చేపట్టిన కరీంనగర్ పోలీసు బృందాలు, అక్కడి పోలీసుల సహకారంతో A3 సల్మాన్ @ భూరే, A4 సల్మాన్ @ విమాన్, A5 మొహమ్మద్ హసీన్‌ను అరెస్ట్ చేశాయి. వారి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

**సీసీటీవీ, డిజిటల్ ఆధారాలే కీలకం**

దోపిడీ అనంతరం నిందితులు ఇంటి ఆవరణలో ఉన్న రెండు మోటార్‌సైకిళ్లను అపహరించి హుజూరాబాద్ వైపు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వివిధ ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక, డిజిటల్ ఆధారాలను విశ్లేషించగా వారు పెద్దపాపయ్యపల్లి సమీపంలో బైక్‌లను వదిలేసి పరారైనట్లు తేలింది. ఈ ఆధారాల ఆధారంగానే నిందితుల జాడను గుర్తించి మీరట్ వరకు చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**కుటుంబ విభేదాలే దోపిడీకి కారణం**

దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, బాధితుడి అల్లుడు రజావుద్దీన్‌కు భార్యతో కుటుంబ విభేదాలు ఏర్పడ్డాయి. వ్యాపారంలో నష్టపోయిన అతను తరచూ డబ్బులు కోరగా కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఇటీవల రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసి తిరస్కరణ ఎదురుకావడంతో ఇంట్లో దోపిడీకి పథకం రచించాడు. బాధితుడి ఇంట్లో కొంతకాలం నివసించడం వల్ల ఇంటి నిర్మాణం, నగదు, నగలు భద్రపరిచే ప్రదేశాలపై పూర్తి సమాచారం ఉండటాన్ని నేరానికి ఉపయోగించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**డమ్మీ పిస్టళ్లు, కత్తులతో దోపిడీ**

పథకం ప్రకారం నిందితులు మీరట్ నుంచి రామగుండం చేరుకుని, జూలై 21/22 అర్ధరాత్రి డమ్మీ పిస్టళ్లు, కత్తులతో ఇంట్లోకి ప్రవేశించారు. కుటుంబ సభ్యులను బెదిరించి చేతులు, కాళ్లు కట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్లను దోచుకెళ్లారు. అనంతరం రెండు మోటార్‌సైకిళ్లను కూడా తీసుకుని పరారయ్యారు.

**A1, A2పై పాత కేసులు**

ప్రధాన నిందితులు రజావుద్దీన్, అజీమ్ రజాపై మీరట్‌లో హత్య, అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం, దొంగతనం తదితర కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తమ సహచరులు అరెస్ట్ అయ్యారని తెలుసుకున్న వీరిద్దరూ కరీంనగర్ పోలీసులకు చిక్కకుండా పాత కేసుల్లో మీరట్ కోర్టులో లొంగిపోయి ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

**కస్టడీకి తీసుకురానున్న పోలీసులు**

A1, A2లను ప్రిజనర్ ట్రాన్సిట్ వారెంట్లపై కరీంనగర్‌కు తీసుకువచ్చేందుకు సంబంధిత న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేసినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన దోపిడీ సొత్తు స్వాధీనం కోసం దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన దర్యాప్తు అధికారులు, ప్రత్యేక పోలీసు బృందాలను పోలీస్ కమిషనర్ అభినందించారు. అలాగే నిందితుల అరెస్టులో సహకరించిన మీరట్ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100/112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఉద్యమ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి

- **నిన్ను మరవదు తెలంగాణ పోరుగడ్డ**
- **టీఎన్జీవోల మాజీ అధ్యక్షులు దేవి ప్రసాద్**

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ఉద్యమ యోధుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి పట్ల టీఎన్‌జీవో సంఘం మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు దేవీప్రసాద్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అకాల మరణం తెలంగాణ ఉద్యమానికి, ప్రజా జీవితానికి తీరని లోటని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సుదర్శన్‌రెడ్డి ధైర్యం, నిబద్ధత, త్యాగంతో పోరాడారని దేవీప్రసాద్ కొనియాడారు. ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చి నిరంతరం ప్రజల మధ్యే పనిచేశారని తెలిపారు. సూటిగా మాట్లాడటం, అన్యాయంపై రాజీలేని పోరాటం చేయడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని అన్నారు. గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల ముందుంచి ప్రశ్నించడంలో సుదర్శన్‌రెడ్డి ముందుండేవారని, అలాగే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని పార్టీ నాయకత్వం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం బాధాకరమని తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు దేవీప్రసాద్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మణుగూరు ఏరియాలో రికార్డు బొగ్గు ఉత్పత్తి

**మణుగూరు, జూలై 31 (మహా న్యూస్):** సింగరేణి మణుగూరు ఏరియా జూలై నెలలో బొగ్గు ఉత్పత్తిలో 154 శాతం లక్ష్యాన్ని సాధించిందని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. 6.48 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 10 లక్షల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. అలాగే ఏప్రిల్-జూలై నాలుగు నెలల ప్రోగ్రెసివ్ ఉత్పత్తిలో 132 శాతం లక్ష్యాన్ని చేరుకుని 42.41 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. బొగ్గు రవాణాలోనూ లక్ష్యానికి మించి పనితీరు నమోదు కాగా, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల అమలులోనూ సంస్థ ముందంజలో ఉందని జీఎం పేర్కొన్నారు.





# పరిశుభ్రత పై అవగాహన

**ఆదిలాబాద్ మహా:** ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా అదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డ్ న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ, భగవతీనగర్ కాలనీలలో వార్డు కౌన్సిలర్ సాయి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్‌తో కలిసి పర్యటించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలో చెత్త పేరుకుపోకుండా చూడటంతో పాటు, డబ్బాలు, కుండీలు, నీటి ట్యాంకులు, కూలర్లు, టైర్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎవరైనా జ్వరం, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని సూచించారు.ముఖ్యంగా విలీన గ్రామ పంచాయతీ , పట్టణంలోని 49 వార్డుల లో ఖాళీ స్థలాల యజమానులు తమ ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలాలను నిర్లక్ష్యంగా వదిలివేయకుండా, అందులో చెట్లు, వ్యర్థాలు,మురుగు నీరు తదితరాలను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. 15 రోజులలోపు సంబంధిత ఖాళీ స్థలాలను శుభ్రపరచుకోవాలని, లేనిపక్షంలో కౌన్సిల్ ఆదేశాల మేరకు రూ.10 వేల వరకు జరిమానాను ప్రాపర్టీ ట్యాక్స్‌లో కలుపుతామని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాల్లో చెత్త, నీరు నిల్వ ఉండడం వల్ల దుర్గంధం ఏర్పడి, దోమలు పెరిగి ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ఓపెన్ ప్లాట్ల యజమానులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ రెడ్డి, మున్సిపల్ అధికారులు, ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది, డీఎంహెచ్ఓ సిబ్బంది, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ డివిజన్ కోసం ఆలేరుబంద్ సక్సెస్

**ఆలేరు జులై 31 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరును ప్రభుత్వం వెంటనే రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ డివిజన్ అఖిలపక్ష పోరాట కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఆలేరు బంద్ సక్సెస్ అయింది . ఈ మేరకు దుకాణ సముదాయాలు వ్యాపార వాణిజ్య సంస్థలు మూసివేసి బందుకు మద్దతు ప్రకటించాయి. అలాగే బస్టాండ్ సమీపంలో అఖిలపక్ష నాయకులు రాస్తారోకో నిర్వహించారు రాస్తారోకో మూలంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది... అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు... ఆలేరు బంద్, రాస్తారోకో ధర్నా సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలేరు సీఐ నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు . ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంపై స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆలేరు అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణ బంద్ నిర్వహించామని ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు తెలిపారు
ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ, భారతీయ జనతా పార్టీ,సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, బీఎస్పీ పార్టీ తో పాటు అంబేద్కర్ యువజన సంఘం, వ్యాపార సంఘాలు, విలేకరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలేరు పేరుకే అసెంబ్లీ ఆలేరు అన్ని రంగాల్లో విద్య రంగంలో వైద్య రంగంలో వ్యాపార రంగంలో పరిశ్రమల రంగంలో పూర్తిగా వెనుకబడిపోతున్నది దీని దృష్టిలో పెట్టుకొని గత ఐదు సంవత్సరాల నుండి అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించామని,




గత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్య మేము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందినిఇదే క్రమంలో ఎన్నికల ప్రచార సభలో రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ప్రకటించారని అన్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే డివిజన్ అంశాన్ని వాడుకొని ఓట్లు దండుకోవడం తప్ప ఆలేరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై చిత్తశుద్ధి లేదు దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఉన్నారు . అలాగే గత పాలకుల అసమర్థత వల్ల ఆలేరు పూర్తిగా నిర్వీర్యం అయిపోతుంది ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు ఒకదాని తర్వాత ఒకటి వేరే ప్రాంతానికి తరలిపోతున్నాయి ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంలో ఉండే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ఈ మధ్యన ఆలేరు ఎమ్మెల్యే యాదగిరిగుట్ట తన నివాసం వద్దకు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఈ విషయంపై తీవ్రంగా ఖండిస్తున్నాము ఈ రకంగా ఒకదాని తర్వాత ఒకటి ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోతే భవిష్యత్తులో జరిగే డిలిమిటేషన్లో అసెంబ్లీ కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఈ కార్యక్రమంలో కన్వీనర్ పసుపునురి వీరేశం,కో కన్వీనర్ చెక్క వెంకటేష్, రాచకొండ జనార్ధన్, వడ్డెమాన్ నరేందర్,పుట్ట మల్లేష్, మొరిగాడి శేఖర్, మొరిగాడి రమేష్, తుంగ కుమార్, చిరిగే శ్రీనివాస్, ఇక్కిర్ సహదేవ్, ఇక్కిరి శ్రీనివాస్, కళ్లెపు అడవయ్య, రాచకొండ సీత, పద్మ సుదర్శన్, ఎలుగల వెంకటేష్, ఎలుగల కుమారస్వామి జంపాల శ్రీనివాస్, పూస శ్రీనివాస్, చిలుకూరు నర్సిరెడ్డి,పూల హనుమంత్, గంగుల శ్రీనివాస్, కంతుల శంకర్, బేతి కృష్ణ హరి,సిహెచ్ ప్రకాష్,కందుల దుర్గేష్, వంగాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ఉధృతంగా.. పెన్ గంగా..

**ఆదిలాబాద్ మహా:** రెండు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు తోడు ఎగువనుండి వస్తున్న వరదనీటితో ఆదిలాబాద్ జిల్లాలోని పెన్‌గంగా ఉగ్రరూపంతో ప్రవహిస్తుంది. అంతర్రాష్ట్ర జాతీయ రహదారిపై డొల్వార వద్ద ఉన్నపెన్ గంగా బ్రిడ్జికి దరిదాపువరకు నీరు చేరడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇంకా మరొక రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే వరద ప్రవాహం పెరిగి బ్రిడ్జికి సరిసమానంగా నీరు వచ్చే అవకాశం కనబడుతోంది. నది తీరాన ఉన్న ఆలయం వరకు ప్రవాహం చేరుకుని ఆలయ గోపురం మాత్రమే కనిపిస్తోంది. అయితే ఇవాళ వర్షం కాస్తా తెరిపివ్వడంతో అధికారులు పరివాహక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



# జిల్లా జైలును సందర్శించిన ఎస్పీ

**ఆదిలాబాద్ మహా :** సెక్యూరిటీ రివ్యూ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిల్లా జైలును సందర్శించారు. జైలు ఆవరణతో పాటు ఖైదీల బ్యారక్‌లు , జైలు ఆసుపత్రి, వంటశాల, పరిపాలనా విభాగాలు, ఇతర గదులను తనిఖీ చేశారు. అలాగే జైలు ప్రహరీ గోడ, భద్రతా గోడలు, ప్రధాన ప్రవేశ ద్వారం, వాచ్ టవర్లు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి, భద్రతా ప్రమాణాలు ఎల్లప్పుడూ పటిష్టంగా ఉండేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఖైదీలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదనంతరం జిల్లా ఎస్పీ జైలు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జైలు భద్రతా ఏర్పాట్లు, ఖైదీల నిర్వహణ, సంక్షేమ చర్యలు, జైలు పరిపాలన తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలు, వారికి అందిస్తున్న భోజనం, వైద్య సేవలు, రోజువారీ విధులు, పునరావాస కార్యక్రమాలు, ఇతర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పెరోల్ మంజూరు ప్రక్రియ, అర్హులైన ఖైదీల దరఖాస్తుల పరిశీలన, నిబంధనల అమలు, పెరోల్‌పై విడుదలయ్యే ఖైదీల పర్యవేక్షణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించి, నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ఖైదీల దరఖాస్తులను సకాలంలో పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జైలు భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఖైదీల సంస్కరణ, పునరావాస కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి, వారు సమాజంలో తిరిగి బాధ్యతాయుతమైన పౌరులుగా స్థిరపడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, వెంకట నరసయ్య, జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి. గోపిరెడ్డి, జైలర్ ఎన్. చంద్రశేఖర్, సీఐ కె. నాగరాజు, ఆర్ఐ డి. వెంకటి, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**కురుమ కార్పొరేషన్ ఏర్పాటుపై కీలక చర్చ**

**హైదరాబాద్ /యాదాద్రి భువనగిరి జులై 31 మహా :** హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానం చేసి, కురుమ సామాజిక వర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రాష్ట్రంలో కురుమ కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆగస్టు 15వ తేదీలోపు కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు.. ఈ నిర్ణయం కురుమ సామాజిక వర్గం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆకాంక్షకు నెరవేర్పుగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ పట్ల కురుమ సమాజంలో ఆనందం వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా యావత్ కురుమ కులస్తుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య , కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్ ఎగ్గే మల్లేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కురుమల సంక్షేమం, సామాజికఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా ఆ వర్గానికి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేరువయ్యే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

భువనగిరి, జూలై 31 (మహా న్యూస్): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఫారాలను బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్ల సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ అనంతరం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టి, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించకుండా ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలో 5 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 6 కేంద్రాల స్థానాలు మార్చినట్లు, ఆలేరు నియోజకవర్గంలో 4 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

### విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని

# విద్యార్థుల మహాధర్నా

**భువనగిరి జూలై 31 మహా :** విద్యార్థులకు రావలసిన 10వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని, జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలని ,సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వేల మంది విద్యార్థులతో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో శుక్రవారం మహా ధర్నా చేశారు ఈ సందర్భంగా రోడ్లన్నీ విద్యార్థులతో నిండిపోయాయి వందలాది మంది పోలీసులు, విద్యార్థి నాయకులు బస్సుల పైకెక్కి నినాదాలు చేశారు అనంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలి, పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలి పాత పద్ధతిలోనే విద్యార్థులకు బకాయిలు చెల్లించాలి విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి విద్యార్థుల స్కాలర్షిప్ల మీద రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణన్న మీద చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలి,

మూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టించుకోవడం లేదు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది అన్నారు ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి సంక్షేమ హాస్టల్స్‌కు సొంతభవనాలు నిర్మించాలి అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన



విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు ఇవ్వాలి 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్రంలో ఎలాంటి మార్పు లేదు హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను తుంగలోకి తొక్కి ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని బెదిరిస్తుంది ఇక ఊరుకునే ప్రసక్తే లేదు ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పల్లపు దుర్గయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయిలు, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల అనిల్,చిల్లర యశ్వంత్,జినుకల జస్వంత్,అరుణ్,ప్రవీణ్,శివ, లవ్డే రామ్ చరణ్ నాయక్ ,లింగస్వామి, శ్రీకాంత్, హరీష్, దామోదర్, ప్రశాంత్, లోకేష్, మానస,సంతోష, శైలజ, విగ్నేశ్వరి, మౌనిక, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# భీమన్న ఆలయంలో 'డిజిటల్' తిప్పలు...!

- **లడ్డూ ప్రసాదాల కౌంటర్ల వద్ద నగదు కోసం భక్తుల అవస్థలు...**
- **డిజిటల్ యుగంలోనూ పాత పద్ధతేనా..?**
- **క్యూఆర్ కోడ్,యూపీఐ చెల్లింపులు అందుబాటులో లేక ఇబ్బందులు..**
- **కౌంటర్ల వద్ద డిజిటల్ చెల్లింపులు ప్రారంభించాలని భక్తుల విజ్ఞప్తి..**

**వేములవాడ మహా:** డిజిటల్ చెల్లింపులు నేడు సామాన్యుడి జీవితంలో భాగమైపోయాయి. చిన్న టీ దుకాణం నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ వరకు ఎక్కడ చూసినా యూపీఐ, క్యూఆర్ కోడ్, డెబిట్ , క్రెడిట్ కార్డు చెల్లింపులు అందుబాటులో ఉన్నాయి. చేతిలో నగదు లేకపోయినా మొబైల్ ఫోన్ ఉంటే చాలు.. క్షణాల్లో చెల్లింపులు పూర్తవుతున్నాయి. అయితే తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో మాత్రం భక్తులకు ఈ డిజిటల్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**- లడ్డూ ప్రసాదం కొనాలంటే నగదు తప్పనిసరి...!**

భీమేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివస్తుంటారు. దర్శనం అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్దకు చేరుకున్న భక్తులకు ప్రస్తుతం నగదు చెల్లింపులే తప్ప మరో మార్గం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రసాదాల కౌంటర్ల వద్ద నగదు రూపంలోనే చెల్లింపులు చేయాలని సిబ్బంది సూచిస్తున్నారని, డిజిటల్ చెల్లింపుల సౌకర్యం లేకపోవడంతో చేతిలో నగదు లేని భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వారు చెబుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చే భక్తులకు ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారుతోంది. చేతిలో మొబైల్ ఉంది.. కానీ లడ్డూ కొనలేని పరిస్థితి!ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటుంది. నగదు తీసుకెళ్లడం కంటే మొబైల్ ద్వారా యూపీఐ చెల్లింపులు చేయడానికే ఎక్కువ మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు లడ్డూ ప్రసాదం కొనుగోలు చేసేందుకు నగదు లేకపోతే సమీపంలోని ఏటీఎం కేంద్రాల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు.కొన్నిసార్లు ఏటీఎంలో నగదు అందుబాటులో లేకపోవడం, ఏటీఎం కేంద్రం ఆలయానికి దూరంగా ఉండటం వంటి కారణాలతో భక్తులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొంతమంది భక్తులు ప్రసాదం కొనుగోలు చేయకుండానే వెనుదిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.

**- 'డిజిటల్ ఇండియా'కు తగ్గట్టుగా మారాలి..!**

దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో ప్రముఖ ఆలయాల్లో కూడా భక్తులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఆలయాల్లో నగదు రహిత చెల్లింపులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో వేములవాడ ఆలయంలోని ప్రసాదాల విక్రయ కేంద్రాల్లోనూ డిజిటల్ చెల్లింపుల సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.కేవలం నగదు చెల్లింపులపై ఆధారపడకుండా యూపీఐ, గూగుల్ పే, ఫోన్‌పే, భీమ్, క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో పాటు డెబిట్ , క్రెడిట్ కార్డు చెల్లింపుల సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**- అన్ని సేవా కౌంటర్ల వద్ద డిజిటల్ సదుపాయాలు కల్పించాలి**

లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాలకే పరిమితం కాకుండా ఆలయంలో భక్తులు వినియోగించే అన్ని రకాల సేవా కౌంటర్ల వద్ద డిజిటల్ చెల్లింపుల సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. ప్రతి కౌంటర్ వద్ద స్పష్టంగా కనిపించేలా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, డిజిటల్ చెల్లింపులు విజయవంతంగా పూర్తయ్యేలా సాంకేతిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నారు.

**ఈవో స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలంటున్న భక్తులు...**

భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాల్సిన ఆలయ యాజమాన్యం ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కల్పించడం వల్ల భక్తులకు ఇబ్బందులు తగ్గడంతో పాటు కౌంటర్ల వద్ద నగదు నిర్వహణ భారం కూడా తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.ఆలయ ఈవో రమాదేవి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రసాదాల కౌంటర్ల వద్ద వెంటనే యూపీఐ, క్యూఆర్ కోడ్, కార్డు చెల్లింపుల సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. 'డిజిటల్ ఇండియా' స్ఫూర్తికి అనుగుణంగా వేములవాడ ఆలయంలోనూ భక్తులకు ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



# హెచ్ఐవీ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..

**ఆదిలాబాద్ మహా:** జిల్లాను హెచ్ఐవీ రహితంగా తీర్చిదిద్దడమే మన అందరి ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బాధితులకు, అనుమానితులకు హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్‌బి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనుమానితులను సమగ్ర తనిఖీ, కౌన్సెలింగ్ కేంద్రాలకు పంపించాలని, బాధితులకు క్రమం తప్పకుండా ఉచిత ఏఆర్‌టీ మందులు అందించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ టెస్టింగ్ సేవలను విస్తరించాలని తెలిపారు. అంతర్జాతీయ లక్ష్యమైన '959595' సాధనకు శ్రమించాలని, హెచ్ఐవీ/ఎయిడ్స్ చట్టం-2017 ప్రకారం బాధితుల సమాచార గోప్యతను కఠినంగా కాపాడాలని సూచించారు.అంతకుముందు జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నాగరాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమాల పురోగతిని, గర్భిణులు, నవజాత శిశువులలో వైరస్ సంక్రమణను అడ్డుకోవడంలో ఏఆర్‌టీ మందుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పి.సాధన, అదనపు డీఎంహెచ్ఓ డా.ఈశ్వర్ రాజ్, ఏఆర్‌టీ వైద్యురాలు డా.పద్మిని ప్రియదర్శిని, డీఏపీసీయూ, ఐసీటీసీ , డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ, టీఐ, ఎల్‌డబ్ల్యూఎస్, సీఎస్సీ, మాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసులకు సత్కారం

**భువనగిరి, జూలై 31 (మహా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ శుక్రవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖకు వారు అందించిన అంకితభావ సేవలను కొనియాడుతూ ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా తుర్కపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎం.డి. కాజా లతీఫ్, భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎం.డి. నుస్రత్ అలీ, చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ కె. శ్రీనివాసులు పదవీ విరమణ పొందారు. వారి సేవలను గుర్తిస్తూ ఎస్పీ అభినందించి, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.





# వరంగల్ జిల్లా నూతన డిఎంహెచ్ ఓ గా డాక్టర్ బి రాజారెడ్డి

**నూతన డిఎంహెచ్వో కు ఘన సన్మానం**

**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ జిల్లా నూతన జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా డా. బి. రాజా రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఐఎన్టియుసి 3194 ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్ రాజారెడ్డిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో ప్రజారోగ్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, వైద్య సిబ్బంది ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, సమర్థవంతమైన పరిపాలనతో జిల్లా ఆరోగ్య రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. పదవి అనేది కేవలం హోదా కాదు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు లభించిన ఒక గొప్ప బాధ్యత అని ఆ బాధ్యతను అంకితభావంతో నిర్వర్తించడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనం అని పేర్కొన్నారు. డాక్టర్ బి రాజా రెడ్డి నాయకత్వంలో వరంగల్ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య సేవల నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల వరకు వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడి, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సిబ్బంది సమన్వయం, ఫార్మసీ సేవల బలోపేతం తో పాటు ప్రజారోగ్య వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చి దిద్దడంలో నూతన డిఎంఅండ్ హెచ్ఓ సహకారం ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బి రాజా రెడ్డి కి నూతన బాధ్యతల సందర్భంగా టీజీపీఓఏ తో పాటు ఐఎన్టియు సి 3194 తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసి ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సంతోష్, జ్యోష్న, వరంగల్ జిల్లా కార్యదర్శి గుగులోత్ వీరేందర్ నాయక్, టీజీపీఓఏ హన్మకొండ జిల్లా కార్యదర్శి జి. సతీష్, ఉపాధ్యక్షులు బుర్ర రవీందర్, ఎ. రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్స్, యూనియన్ బాధ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- నెహ్రూ మెమోరియల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ



**వరంగల్, బ్యూరో మహా ;** వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, నెహ్రూ మెమోరియల్ స్కూల్ ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం పాత భవనం పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులను పరిశీలించారు.పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు, కాంపౌండ్ గేట్ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పాటు ఆవరణ పరిశుభ్రత పై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.దేశాయిపేట, ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత పాఠశాల భవనం పునరుద్ధరణ పనులను కూడా పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతి పై జిల్లా విద్యాశాఖాధికారిని (డీఈఓ) అడిగి తెలుసుకున్నారు. రెనోవేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ),ఎ ఎం ఓ ఉండ్రాతి సుజన్ తేజ, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ , ఇంజినీరింగ్ అధికారులు, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# శాలెం రాజుకు ఘన సన్మానం

**కొత్తగూడెం, జూలై 31 (మహా న్యూస్):** సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శాలెం రాజు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. 38 ఏళ్లపాటు సంస్థలో సేవలందించిన ఆయన బొగ్గు ఉత్పత్తి, గనుల భద్రత, ఉద్యోగుల సంక్షేమానికి విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా శాలెం రాజు మాట్లాడుతూ సింగరేణి వంటి ప్రతిష్టాత్మక సంస్థలో జీఎంగా పదవీ విరమణ చేయడం తనకు గర్వకారణమని, సహకరించిన యాజమాన్యం, అధికారులు, ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కార్మిక ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవ్ మణుగూరు–సేవ్ సింగరేణి నినాదంతో..

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

- పీకేఓసీ-2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి..
- ప్రభుత్వాలు స్పందించకపోతే చలో హైదరాబాద్ : ఏఐటీయూసీ హెచ్చరిక
- సిపిఐ, ఏఐటియుసి నాయకులు.. కార్మికుల భారీ ర్యాలీ, రాస్తారోకో..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పీకేఓసీ2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను జెన్‌కోకు కాకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరులో భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. వేలాది మంది కార్మికులు, ప్రజలు పాల్గొని సేవ్ మణుగూరు-సేవ్ సింగరేణి, మా బొగ్గు గనులు మా సింగరేణికే అంటూ నినాదాలతో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి భవిష్యత్తే మణుగూరు భవిష్యత్తని అన్నారు. ఒకవైపు సింగరేణి తెలంగాణకు గుండెకాయ అని చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు పీకేఓసీ2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను జెన్‌కోకు అప్పగించే ప్రయత్నాలు చేయడం సింగరేణిపై వివక్షకు నిదర్శనమని విమర్శించారు. జెన్‌కో, సింగరేణి రెండూ ప్రభుత్వ సంస్థలే అయినప్పటికీ సింగరేణి ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యవహరించడం సమంజసం కాదన్నారు. అనంతరం
ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా సింగరేణి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సింగరేణికి రావాల్సిన వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా, సంస్థకు కేటాయించాల్సిన బొగ్గు బ్లాకులను ఇతర సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇది సింగరేణిని బలహీనపరిచే కుట్రలో భాగమేనని అన్నారు. ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య మాట్లాడుతూ మణుగూరు ఉనికి, భవిష్యత్తుకు సంబంధించిన ఈ ఉద్యమాన్ని అణచివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తే మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఐతో పాటు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను ఏకం చేసి మహా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. లాఠీలకు, తూటాలకు భయపడేది లేదు.. సింగరేణి కోసం చివరి వరకు పోరాడతామని ప్రకటించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి ధర్నాను భగ్నం చేయడం దురదృష్టకరమని నాయకులు మండిపడ్డారు. ప్రజల గొంతును అణచివేయాలని ప్రయత్నిస్తే ఉద్యమాలు మరింత బలపడతాయని హెచ్చరించారు. పీకేఓసీ2 డీప్ సైడ్ బ్లాక్‌ను జెన్‌కోకు కేటాయించడం చివరికి ప్రైవేటీకరణకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల ఉద్యోగ భద్రత, మణుగూరు ప్రజల జీవనాధారం, తెలంగాణ సంపదను కాపాడేందుకే ఈ ఉద్యమం చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పీకేఓసీ2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, జెన్‌కో టెండర్ ప్రక్రియ నుంచి తప్పుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో హైదరాబాద్ పిలుపునిస్తూ సింగరేణి వ్యాప్తంగా మహా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, ఉపాధ్యక్షుడు రామ నర్సయ్య, సహాయ కార్యదర్శి మేకల ఈశ్వర్‌రావు, నాయకులు ఆవుల నాగరాజు, ఆదేర్ల సురేందర్, బి సురేందర్‌రావు, శనిగరపు కుమారస్వామి, ఆడెపు రాజశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మున్నా లక్ష్మీకుమారి, సీనియర్ నాయకుడు జంగం మోహన్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైల్ భరో.. జయప్రదం చేయాలి..

- సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యకర్తలకు పిలుపు..
- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమం..
- మణుగూరులో వేలాదితో జైల్ భరో నిర్వహించాలని నిర్ణయం..
- వ్యకాస, సీఐటీయూ నాయకులు కనకయ్య, బ్రహ్మాచారి



మణుగూరు, మహా : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోందని, వాటికి నిరసనగా ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మణుగూరులోని శ్రామిక భవన్‌లో శుక్రవారం కొడిశాల రాములు అధ్యక్షతన మూడు సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె బ్రహ్మాచారి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. లేబర్ కోడ్‌ల అమలుకు తుది నిబంధనలు రూపొందించడం, విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన చట్ట సవరణలు, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు, ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే ప్రతిపాదనలు, సమ్మె హక్కుపై ఆంక్షలు, కార్మిక సంఘాల గుర్తింపును బలహీనపరిచే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఐటీయూ నేత కె బ్రహ్మాచారి మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తేనే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమన్నారు. మణుగూరులో వేలాది మందితో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు పిట్టల నాగమణి, రైతు సంఘం మండల కార్యదర్శి బి. రాజు, ఎస్. వెంకట్రావు, సీఐటీయూ నాయకులు ములకల ఉత్తమ్, ఆర్. శ్రీను, శైలజ సత్యనారాయణ, మహిళా సంఘం నాయకురాలు నాగమ్మ, పల్లి చంద్రయ్య, రెడ్డి పల్లపు నాగేశ్వరరావు, రంగా కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ సింగరేణి రాస్తారోకో భగ్నం

**మణుగూరు, జూలై 31 (మహా న్యూస్):** పీకేఓసీ డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో మణుగూరులో నిర్వహించిన సేవ్ సింగరేణి-సేవ్ మణుగూరు ర్యాలీ, రాస్తారోకోను పోలీసులు అడ్డుకుని పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌తో పాటు పలువురు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులను అరెస్ట్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను అణచలేరని, పీకేఓసీ డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. త్వరలో చలో హైదరాబాద్ కార్యక్రమంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను విస్తరిస్తామని ప్రకటించారు.



# వాకింగ్ చేయండి ఆరోగ్యంగా ఉండండి

- సింగరేణి ఏరియా జిఎం శాలెం రాజు
- రామవరం గణేష్ చమన్ వద్ద వాకింగ్ ట్రాక్ ప్రారంభం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కార్మికుల ఉద్యోగుల వారి కుటుంబాల ప్రజల ఆరోగ్యం కొరకు వ్యాయామానికి సంబంధించిన వసతులను సింగరేణి ఆధ్వర్యంలో కల్పించడం జరుగుతుందని సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం శాలెం రాజు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని రామవరం గణేష్ చమన్ వద్ద సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్మించిన 400 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి సంస్థ ఈ వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసిందన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో నిత్య నడక (వాకింగ్) కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.ఈ ట్రాక్ ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ప్రజలు యువత మహిళలు వృద్ధులు నిత్యం వాకింగ్ చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనలో సింగరేణి ఎల్లప్పుడూ ముందుంటుందని భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్వో టు జీఎంఎం. గోవిందరావు, సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏజీఎం (సివిల్)సి.హెచ్.రామకృష్ణ, కె.రాజారాం, ఏరియా ఇంజనీర్ వి.రామకృష్ణ, డిజిఎం(ఈ అండ్ ఏం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్, సీనియర్ పిఓ మజ్జి మురళి, ఇతర విభాగ అధికారులు, సింగరేణి ఉద్యోగులు స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# పేదల ప్రజల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యం

- ప్రతి 45 రోజులకు ఒకసారి పథకాల అమలుపై సమీక్ష జరపాలి
- ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరమయ్యేలా కృషి చేయాలి
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి
- యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ మండలాల్లో వరుస సమీక్షలు.
- అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సాగాలని నిర్దేశం




**ఇబ్రహీంపట్నం జూలై 31 మహా:** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి వరుస సమీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం యాచారం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే... మండలానికి చెందిన వివిధశాఖల అధికారులు, సర్పంచ్ లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, క్షేత్రస్థాయిలో అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ లు తన దృష్టికి తీసుకువచ్చిన పలుసమస్యలపై ఆరాతీసిన మల్ రెడ్డి రంగారెడ్డి.... సంబంధిత అధికారులతో చర్చించారు. సమస్యలు లేని గ్రామాల నిర్మాణానికి చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ఒక్కో శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. భూసమస్యలు, ఆక్రమణలు, అక్రమంగా అనుమతుల విషయంలో పలుసూచనలు చేశారు. అధికారులెవరికీ తలొగ్గవద్దని చెప్పిన ఎమ్మెల్యే... దోపిడి, కబ్జాలను సహించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.

ఊళ్లో పుట్టి పెరిగిన తనకు పేదల సమస్యలన్నీతెలుసునన్న మల్ రెడ్డి రంగారెడ్డి.... వారి కోసమే నిరంతరం తొర్రూర్ లో అందరికీ అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజూ వేలాది మంది తన వద్దకు వస్తుంటారన్న ఆయన... క్షేత్రస్థాయిలోనే అధికారులు సమస్యలకు పరిష్కారం చూపితే వారికి అక్కడి వరకు వచ్చే పని ఉండదని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ప్రతీ 45రోజులకోసారి సమీక్ష చేయాల్సి ఉంటుందన్న ఎమ్మెల్యే... సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఆ బాధ్యత అధికార యంత్రాంగంపైనే ఉంటుందని చెప్పారు.ప్రజలను ఇబ్బందిపెట్టే అధికారులు ఎవరైనా సహించే ప్రసక్తే లేదని హెచ్చరించిన మల్ రెడ్డి... ఇటీవల యాచారం మండలంలో ఓ అధికారి తీరును ప్రస్తావించారు.

**నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరుగుతుంది....**

యాచారం మండలంలో భూసేకరణతో నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి హామీ ఇచ్చారు. పరిహారం పెంపు విషయంపై ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చించినట్లు చెప్పారు. రైతులను అడ్డం పెట్టుకుని గతంలో డబ్బులు వసూలు చేసిన వారందరినీ బయటికి తీయకతప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా పనిచేస్తున్నామన్న మల్ రెడ్డి రంగారెడ్డి... ఇందుకు ప్రతి అధికారి సహకరించాలని చెప్పారు. అభివృద్ధికి నిధుల గురించి ఆందోళన అవసరంలేదని... కావాల్సిన నిధులను తెచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణ, ఆస్పత్రి నిర్మాణం, రోడ్లకు 338కోట్ల రూపాయలు మంజూరు చేయించిన అంశాలను ఉదాహరించారు. అభివృద్ధి చేయలేని వారు మాటలు మస్తుగా మాట్లాడుతుంటారని, పదేళ్లలో పనులు ఎందుకు చేయలేకపోయారో ప్రశ్నించాలని మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. పలువురు సర్పంచులు లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చిన ఎమ్మెల్యే... ప్రతీగ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తాను చేస్తున్న కృషిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు కమిటీల చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, రెండు మండలాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.



# మారుమూల గిరిజన గ్రామంలో 'ఫ్రైడే డ్రైడే' నిర్వహణ..

- బుగ్గ గ్రామంలో వైద్య శిబిరం..
- సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన
- లార్వా నిర్మూలన, గృహ సందర్శనలు, ఉచిత వైద్య సేవలు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని మారుమూల అటవీ ప్రాంతంలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన బుగ్గలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల మధ్య చిత్తడిగా మారిన అటవీ మార్గంలో ప్రయాణించి గ్రామానికి చేరుకున్న వైద్య సిబ్బంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గృహ సందర్శనలు నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న కంటైనర్లలో దోమల లార్వా గుర్తించి వాటిని తొలగించడంతో పాటు, నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, శుద్ధి చేసిన తాగునీటినే వినియోగించాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, కృష్ణ, సుజాత, కౌసల్య మీనా పాల్గొని ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



# ఫార్మ్ ఫండ్ పనులకు శ్రీకారం

- ప్రభుత్వ పథకాలు రైతులు ఉపయోగించుకోవాలి
- సర్పంచ్ లక్ష్మి కుమారి

**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామపంచాయతీలో వి బి జిరాంజీ పథకం లో బొర్రా యశోద పంట పొలంలో గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మి కుమారి, కార్యదర్శి కృష్ణ తో కలిసి శుక్రవారం ఫార్మ్ ఫండ్ పనులకు శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి పనులను శుభారంభం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి కుమారి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మ్ ఫండ్ (నీటి కుంట) ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఫార్మ్ ఫండ్ వలన భూగర్భ జలాలు పెరుగుతాయని, భూమి కోత నుండి కాపాడుకోవచ్చునని, చేపల పెంపకాన్ని చేపట్టవచ్చునని, వర్షపు నీటిని సంరక్షించవచ్చునని, పంటలకు నీటి భద్రత ఉంటుందని తెలిపారు. రైతులకు ఏమాత్రం ఖర్చు లేకుండా, విబి జిరాంజీ పథకంలో ఫార్మ్ ఫండ్ లు తీపించుకోవచ్చునని అన్నారు. కావున గ్రామంలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిఏ నాగమణి, ఈసి సైదులు ఎఫ్ఏ రవి తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు వింగ్ అప్రమత్తంగా ఉండాలి

- **లోతట్టు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలి**
- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:గోదావరి వరదల పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ స్లూయిస్, గోదావరి కరకట్ట, స్నాన ఘాట్లు, వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ప్రజల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గోదావరిలో వరద ప్రవాహం తీవ్రంగా ఉన్నందున జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి స్నాన ఘాట్లు నదీ తీర ప్రాంతాలు లోతట్టు గ్రామాలు ఇతర పర్యాటక ప్రాంతాల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను గోదావరిలోకి అనుమతించవద్దని సెల్ఫీలు వీడియోల కోసం ప్రమాద ప్రాంతాలకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారుల వివరాలను సేకరించి వరద ఉధృతి తగ్గే వరకు ఎవరూ నదిలో చేపల వేటకు వెళ్లకుండా హెచ్చరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న డిడిఆర్ఎఫ్ బృందాలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు ప్రతి పోలీసు వాహనంలో లైఫ్ బోయ్‌లు, లైఫ్ జాకెట్లు, టార్చ్ లైట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ తదితర విపత్తు నిర్వహణ పరికరాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అత్యవసర సమాచారం ఫిర్యాదులపై వెంటనే స్పందించి వేగవంతమైన సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ అధికారులు ఎస్‌డీఆర్ఎఫ్ , డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకుని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.



# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై సమరశంఖం పూరించాలి

కొత్తగూడెం, జూలై 31 (మహా న్యూస్): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పాల్వంచలో శుక్రవారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల-పట్టణ కార్యదర్శులు, ప్రజాసంఘాల బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించడంలో, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని, ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 6 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు, సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ సీతారామ, సీతమ్మధార ప్రాజెక్టుల ద్వారా జిల్లా రైతులకు సాగునీరు అందించాలని, పోడు రైతులకు పట్టాలు, నిరుపేదలకు ఇళ్లు, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసి కాంట్రాక్టు ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# న్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తున్నాం

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద**
- **సర్-2026 ప్రక్రియ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష**

**వరంగల్,బ్యూరో మహా;** జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్2026 పురోగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, అభ్యంతరాలను ఎన్నికల నిబంధనల మేరకు సమర్పించాలని కోరారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల వివరాలను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సర్ కార్యక్రమంలో పూర్తి పారదర్శకత, సమన్వయంతో ముందుకు సాగాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డియార్వో విజయలక్ష్మి , వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు, సంబధిత మండలాల తహసీల్దార్లు పాల్గొనగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి,మహా:** ప్రజలకు మెరుగైనసేవలు అందించేలా ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకొని కృషి చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచించారు. శుక్రవారం రోజు నెన్నెల మండల సర్పంచ్ & ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులను బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు .ఇటీవల జరిగిన నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ & ఉప సర్పంచ్ ఫోరం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నెన్నెల మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు జాడి రాజ్ కుమార్, ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బైరీ సాయిగౌడ్ లను బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి అభినందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెన్నెల మండలంలోని సర్పంచ్‌లు ,ఉప సర్పంచ్ ల సమస్యలను ఎప్పటికప్పుడు



తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఫోరం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు బొమ్మెన హరీష్ గౌడ్,జిల్లా డిసిసి కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, నాయకులు గురునాథం మల్లాగౌడ్, తిరుపతి రెడ్డి, లావుడ్య రమేశ్ ,ఉయ్యాల మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలి

- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన**
- **గోదావరి వరద పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ప్రజల సహాయార్థం 24 గంటలు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ సేవలు అందుబాటులో ఉన్నాయని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం భద్రాచలం వద్ద గోదావరి వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ వద్ద వరద నీటి పారుదల పరిస్థితి మోటార్ల పనితీరును ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీరు వేగంగా బయటకు వెళ్లేలా మోటార్లను నిరంతరం నిర్వహించాలని ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కరకట్టపై నుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ స్నానఘాట్ల వద్ద పరిస్థితిని సమీక్షించారు. గోదావరిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను అనుమతించరాదని ప్రమాద ప్రాంతాల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని పోలీసు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై గోదావరి వరద నీరు ఎక్కడ వరకు చేరిందనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం వేగంగా పెరుగుతోందన్నారు. శుక్రవారం గోదావరి నీటిమట్టం 48.00 అడుగులకు చేరుకోవడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 11,44,645 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోందని నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించేలా అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు ఆహారం విద్యుత్ పారిశుధ్యం వైద్య సేవలు మహిళలు చిన్నారులు వృద్ధులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. వరదల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ పోలీసు ఇరిగేషన్ పంచాయతీ రాజ్ మున్సిపల్ వైద్య విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు భద్రాచలం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఫోన్: 08744241950, వాట్సాప్: 9392919743 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరిలోకి దిగరాదని సెల్ఫీలు వీడియోల కోసం ప్రమాద ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను లేదా 100 నంబర్‌కు సమాచారం అందించి పోలీసు సహాయం పొందాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో సమన్వయంతో ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ ఎస్సీ మహేశ్వర రావు, దేవస్థానం ఈవో దామోదర్ రావు, భద్రాచలం తాసిల్దార్ రామకృష్ణ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, డిడి ఆర్ఎఫ్ అధికారులు,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల సౌకర్యాలు మెరుగుపరచాలి

**కారేపల్లి, జూలై 31 (మహా న్యూస్):** కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన సర్వే అనంతరం ప్రిన్సిపాల్ ఎన్. విజయకుమారితో చర్చించి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 380 మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో పాటు గ్రంథాలయం, ల్యాబ్‌లు కూడా ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. కనీసం ఆరు అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రహరీ లేకపోవడంతో ఆటస్థలం పశువుల మేత స్థలంగా మారిందని, విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ లేకపోవడం, ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోవడం, నిర్వహణ నిధులు విడుదల కాకపోవడం, యూనిఫాంలు అందించకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఖాకీ ముసుగులో కామాంధుడు

**లైంగిక దాడి, బెదిరింపుల కేసులో సబ్ ఇన్‌స్పెక్టర్ అరెస్ట్, రిమాండ్**

**వరంగల్, క్రైం ;** సోషల్ మీడియా వేదికగా మహిళలతో పరిచయాలు పెంచుకొని, వారిని నమ్మించి లైంగికంగా వేధించడం, బలవంతపు శారీరక సంబంధాలకు పాల్పడటం, బెదిరింపులకు దిగడం వంటి తీవ్ర నేరాలకు పాల్పడిన సబ్ ఇన్‌స్పెక్టర్ కదిరే శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ తెలిపారు.నిందితుడు కదిరే శ్రీకాంత్ (38), రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలానికి చెందినవాడు. వివాహితుడైన అతను 2014 బ్యాచ్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించాడు. సోషల్ మీడియా ద్వారా మహిళల ప్రొఫైళ్లను వెతికి వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతూ, పరిచయం పెంచుకొని వారిని మానసికంగా, శారీరకంగా వేధించే అలవాటు కలిగి ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. 2025 సంవత్సరంలో ఓ మహిళతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం పెంచుకున్న నిందితుడు, తాను పోలీస్ అధికారినని నమ్మబలికి ఆమెతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నాడు.ఆమె వ్యక్తిగత పరిస్థితులను ఆసరాగా చేసుకొని, వరంగల్ లోని ఆమె నివాసానికి వెళ్లి బలవంతంగా శారీరకంగా దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం పలు సందర్భాల్లో హోటళ్లకు తీసుకెళ్లి ఆమె పై బలవంతపు లైంగిక దాడులకు పాల్పడినట్లు విచారణలో తేలింది. అలాగే, బాధితురాలి నగ్న చిత్రాలు తన వద్ద ఉన్నాయని అబద్ధం చెప్పి, విషయం బయటకు చెబితే చంపేస్తానంటూ బెదిరించడం, వీడియో కాల్స్ ద్వారా అసభ్యకరంగా వేధించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు కూడా నిందితుడు పాల్పడినట్లు వెల్లడైంది. బాధితురాలు తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, రాజకీయ నాయకుల మద్దతు తనకు ఉందని, ఎవరూ తనను ఏమీ చేయలేరని బెదిరించినట్లు తెలిసింది. బాధితురాలు సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, తనను పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో నిందితుడు విధులకు హాజరు కాకుండా గోవా, హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో తలదాచుకుంటూ తిరిగినట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు తాను ఉపయోగించిన సిమ్ కార్డులను ధ్వంసం చేసి, కేవలం వైఫై ద్వారా మాత్రమే కమ్యూనికేషన్ కొనసాగించినట్లు గుర్తించారు.ఇదివరకు కూడా నిందితుడు హైదరాబాద్‌కు చెందిన మరో యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగికంగా దోపిడీ చేసిన కేసులో జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారంతో నిందితుడి ఆచూకీని గుర్తించిన పోలీసులు, నిజామాబాద్‌లో అతడిని అదుపులోకి తీసుకొని సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా హనుమకొండ జిల్లా మూడవ అదనపు కోర్టు న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. ముఖ్యంగా మహిళలు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఇన్స్పెక్టర్ ఎం రంజిత్ కుమార్ సూచించారు.

# బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం ప్రారంభం**

**బెల్లంపల్లి, జూలై 31 (మహా న్యూస్):** బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం కాసిపేట మండలం పల్లంగూడ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అంతర్రాష్ట్ర దొంగ సహా ముగ్గురు అరెస్ట్!

**ఇబ్రహీంపట్నం జూలై 31 మహా**: రాజధాని శివార్లలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగల ముఠా గుట్టును ఆదిభట్ల పోలీసులు రట్టు చేశారు. ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర నేరస్తుడితో పాటు, బైక్ దొంగతనాలకు అలవాటు పడిన మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి, శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే రాజస్థాన్‌కు చెందిన ముఖేష్ చౌదరి (35) ప్రస్తుతం కేపీహెచ్‌బీలోని ఓ హాస్టల్‌లో ఉంటూ జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. గతంలో హార్డ్‌వేర్ దుకాణం నడిపిన ముఖేష్, వ్యసనాలకు బానిసై అప్పులపాలయ్యాడు. దీంతో 2024 నుంచి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఇతనిపై గతంలో పిడి యాక్ట్ నమోదు



కావడమే కాకుండా, 17 కేసుల్లో ప్రమేయం ఉంది. పక్కా సమాచారంతో ఆదిభట్ల క్రైమ్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెగూడ వద్ద నిఘా పెట్టి ముఖేష్ చౌదరిని అదుపులోకి తీసుకున్నారు. అతని అరెస్ట్‌తో ఆదిభట్ల (2), హయాత్‌నగర్ (4), కుషాయిగూడ (1) పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొత్తం 7 చోరీ కేసుల గుట్టు రట్టయింది. మరో ఘటనలో అలవాటుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. A1: సయ్యద్ ఖాసిం హుస్సేన్ (18) దబీర్‌పుర (గతంలో 5 కేసుల్లో ప్రమేయం, మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్లో కేసులో పరారీలో ఉన్నాడు) A2: మహమ్మద్ కరీం (19) బండ్లగూడ, వీరిద్దరి నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు చోరీ ఘటనల్లో రూ. 6.5 లక్షల విలువైన 3 తులాలు బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, 5 ద్విచక్ర వాహనాలు, చోరీకి వాడిన గ్లామర్ బైక్, 1 సెల్ ఫోన్ లను నేరస్థులను నుండి స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఆదిభట్ల సీఐ రమేష్, ఎస్సై నోయల్ రాజు పాల్గొన్నారు.



# రిటైర్డ్ సింగరేణి అధికారులకు ఘన సన్మానం

**కొత్తగూడెం, జూలై 31 (మహా న్యూస్)**: సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పదవీ విరమణ పొందిన జీఎంలు ఎన్. దామోదరరావు, కవితా నాయుడు, బి. రమేష్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలతో వారిని సత్కరించి, సంస్థ అభివృద్ధికి వారు అందించిన 35 ఏళ్లకు పైగా సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు జనరల్ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.




# థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందని సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు రోజుకు 28 నుంచి 32 రేకుల ద్వారా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని అన్ని ఏరియాల జీఎంలకు ఆదేశాలు జారీ చేశారు.

సింగరేణి భవన్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి రవాణా ఓవర్ బర్డెన్ తొలగింపు నాణ్యత అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా ఓపెన్‌కాస్ట్ గనుల ఉత్పత్తిపై కొంత ప్రభావం పడినా ముందస్తు జాగ్రత్తలతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను తప్పకుండా సాధించాలని సూచించారు. అదే సమయంలో వర్షాకాలంలో భూగర్భ గనుల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 7580 శాతం బొగ్గును సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సింగరేణి రెస్క్యూ బృందాలు ఇతర విభాగాల అధికారులు వెంటనే సహాయక చర్యల్లో పాల్గొనేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.బొగ్గు ఉత్పత్తికి అనుగుణంగా అన్ని ఓపెన్‌కాస్ట్ గనుల్లో లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని, 500 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని చేరుకునేందుకు కొత్త గనులకు అవసరమైన వివిధ అనుమతుల సాధన ప్రక్రియను ఇప్పటి నుంచే వేగవంతం చేయాలని సూచించారు.సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ(ఆపరేషన్స్), డైరెక్టర్కె.వెంకటేశ్వర్లు (పీ అండ్ పీ), డైరెక్టర్ గౌతమ్ పోట్రు(పర్సనల్, ఫైనాన్స్), డైరెక్టర్ (ఈ అండ్ఎం) ఎం.తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్)బి .వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ విభాగాల జనరల్ మేనేజర్లు శాఖాధిపతులు పాల్గొన్నారు.

# రేషన్ షాపులను తనిఖీ చేసిన సివిల్ సప్లై అధికారి

సీతారాంపురం రేషన్ షాపు సీజ్

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం లో రేషన్ షాపులను ఖమ్మం రూరల్ సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ విజయబాబు శుక్రవారం తనిఖీ చేశారు. సీతారాంపురం గ్రామంలో గల రేషన్ షాపును తనిఖీ చేయగా 128 క్వింటాల 37 కేజీలు వ్యత్యాసం రావడంతో రేషన్ డీలర్ ఈసం కృష్ణపై 6ఏ కేసు నమోదు చేసి రేషన్ షాప్ ను సీజ్ చేశారు. దీని నిర్వహణను సమీప డీలర్ ఎట్టి నాగేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించినారు. ఈ తనిఖీలో సివిల్ సప్లై రెవిన్యూ ఇన్స్పెక్టర్ వీరయ్య పాల్గొన్నారు.

# సముద్ర తీరంలో ఇష్వర్యా మేనన్ సందడి

దక్షిణాది సినీ నటి ఇష్వర్యా మేనన్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సాయంత్రపు బంగారు కాంతుల్లో సముద్ర తీరాన్ని నేపథ్యంగా చేసుకుని నిర్వహించిన ఈ ఫొటోషూట్‌లో ఇష్వర్యా ఎంతో అందంగా కనిపించారు. సహజసిద్ధమైన ప్రకృతి అందాలతో కలిసిపోయిన ఆమె స్టైలింగ్‌కు అభిమానుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.పూల డిజైన్‌తో రూపొందించిన రెండు భాగాల దుస్తుల్లో ఇష్వర్యా మేనన్ సమ్మర్ ఫ్యాషన్‌కు కొత్త అర్థం చెప్పినట్లు కనిపించారు. లేత ఆకుపచ్చ, సూర్యాస్తమయపు నారింజ రంగుల సమ్మేళనంలో ఉన్న ఈ దుస్తులు ఆమెకు ప్రత్యేక ఆకర్షణను తీసుకువచ్చాయి. గాలికి అలవోకగా ఎగిరే జుట్టు, తక్కువ మేకప్, సహజమైన చిరునవ్వుతో ఆమె ఎంతో ఆకర్షణీయంగా మెరిశారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సింపుల్‌గా కనిపించినా, ఆమె లుక్ మాత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇష్వర్యా మేనన్ ఫ్యాషన్ ఎంపికలు ఎప్పటికప్పుడు యువతను ఆకట్టుకుంటుంటాయి. ఈ తాజా ఫొటోషూట్ కూడా బీచ్ ఫ్యాషన్‌కు ఆదర్శంగా నిలుస్తోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఆమె స్టైల్, ఆత్మవిశ్వాసం, సహజమైన అందం కలిసి ఈ ఫొటోలను మరింత ప్రత్యేకంగా మార్చాయి.సినిమాల విషయానికి వస్తే, ఇష్వర్యా మేనన్ దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తమిళం, తెలుగు, మలయాళ చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ నటిగా తన ప్రతిభను చాటుకుంటున్నారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ ఆమె కెరీర్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం భారీ స్థాయిలో రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ పౌరాణిక యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో పురాతన దేవాలయ రహస్యాలు, అపురూప నిధుల అన్వేషణ ప్రధాన కథాంశంగా ఉండనుంది. ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విభిన్న కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమా ఇష్వర్యా మేనన్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. సోషల్ మీడియాలోనూ ఇష్వర్యా మేనన్‌కు భారీ అభిమాన వర్గం ఉంది. ఆమె పంచుకునే ప్రతి ఫొటో, ప్రతి అప్‌డేట్ క్షణాల్లో వైరల్ అవుతుండటం విశేషం. తాజా బీచ్ ఫొటోషూట్ కూడా అభిమానుల నుంచి లక్షలాది లైక్‌లు, ప్రశంసలు అందుకుంటూ సోషల్ మీడియాను హోరెత్తిస్తోంది.



## సర్దార్ 2 టీజర్‌తో అంచనాలు

# ఆకాశమే హద్దు




టాలీవుడ్, కోలీవుడ్ సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' నుంచి విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కార్తీ హీరోగా, దర్శకుడు పి.ఎస్. మిత్రన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 2022లో ఘన విజయం సాధించిన 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. తొలి భాగంలో స్పై యాక్షన్, ఎమోషన్స్, ట్విస్టులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న మేకర్స్, ఇప్పుడు మరింత భారీ స్థాయిలో రెండో భాగాన్ని సిద్ధం చేస్తున్నారు.

తాజాగా విడుదలైన టీజర్ ఆద్యంతం యాక్షన్, సస్పెన్స్, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది. ప్రారంభంలో ఎస్.జె. సూర్య వాయిస్ ఓవర్‌లో వినిపించే "ఇద్దరు స్పైలు.. ఒక తండ్రి, ఒక కొడుకు" అనే డైలాగ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈసారి కార్తీ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు టీజర్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఒక పాత్రలో రగ్డ్, అనుభవజ్ఞుడైన స్పైగా, మరో పాత్రలో యువకుడైన స్టైలిష్ ఏజెంట్‌గా కార్తీ విభిన్నమైన లుక్స్‌లో ఆకట్టుకుంటున్నారు. రెండు పాత్రల మధ్య ఉండే భావోద్వేగాలు, మిషన్ నేపథ్యం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు తెలుస్తోంది. ఈ టీజర్‌లో మరో ప్రధాన హైలైట్ ఎస్.జె. సూర్య విలన్ పాత్ర. స్టైలిష్ గెటప్, విభిన్నమైన మేనరిజమ్స్, పవర్‌ఫుల్ డైలాగులతో ఆయన పాత్రకు ప్రత్యేక గుర్తింపు లభించింది. "టెక్నికల్లీ నేనే మంచివాడిని.. వాళ్లే బ్యాడ్ గైస్" అంటూ చెప్పే డైలాగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హీరో-విలన్ మధ్య జరిగే మైండ్ గేమ్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనున్నట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. సాంకేతికంగా కూడా 'సర్దార్ 2' అత్యున్నత ప్రమాణాలతో రూపొందుతున్నట్లు టీజర్ తెలియజేస్తోంది. హాలీవుడ్ స్థాయి యాక్షన్ సీక్వెన్స్‌లు, గ్రాండ్ విజువల్స్, అద్భుతమైన సినిమాటోగ్రఫీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా సంగీత దర్శకుడు సామ్ సి.ఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి మరింత ఉత్కంఠను జోడించి టీజర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఈ చిత్రంలో కార్తీ సరసన మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. భారీ యాక్షన్, థ్రిల్లింగ్ కథనం, అత్యాధునిక సాంకేతిక విలువలతో రూపొందుతున్న ఈ సినిమాపై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మేకర్స్ ప్రకటించిన ప్రకారం 'సర్దార్ 2' ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 10, 2026న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే టీజర్‌కు వస్తున్న అద్భుతమైన స్పందన చూస్తుంటే, విడుదలకు ముందే ఈ సినిమా హాట్ టాపిక్‌గా మారింది. తొలి భాగాన్ని మించిన యాక్షన్, మరింత బలమైన కథ, ఊహించని ట్విస్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న 'సర్దార్ 2' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.



## 'చిరంజీవి-నాగార్జున'

# మల్టీస్టారర్..

టాలీవుడ్‌లో మల్టీస్టారర్ సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేకమైన ఆదరణ ఉంటుంది. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే చిత్రంలో నటిస్తే అభిమానులతో పాటు సినీ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొంటాయి. తాజాగా మెగాస్టార్ చిరంజీవి, కింగ్ నాగార్జున కాంబినేషన్‌లో ఓ భారీ మల్టీస్టారర్ తెరకెక్కబోతోందనే వార్త సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో ఇద్దరు హీరోల అభిమానుల్లోనూ ఆసక్తి నెలకొంది.ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ఆ సినిమా కమర్షియల్‌గా భారీ వసూళ్లు సాధించడంతో మరోసారి ఈ కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న 'మెగా 158' కూడా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్లు సమాచారం. మరోవైపు అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమా కోసం సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వం వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నాగార్జున తన వందో చిత్రాన్ని ప్రత్యేకంగా రూపొందించాలనే లక్ష్యంతో కథల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి సమయంలో చిరంజీవి, నాగార్జున కలిసి ఒకే సినిమాలో నటించబోతున్నారనే వార్త ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరు సీనియర్ స్టార్ హీరోల మధ్య మంచి స్నేహబంధం ఉంది. పలుమార్లు ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించిన వీరు ఇప్పుడు ఒకే తెరపై కనిపిస్తే ప్రేక్షకులకు అది అరుదైన అనుభూతిగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక మల్టీస్టారర్‌కు విజయవంతమైన కమర్షియల్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. కామెడీ, యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్‌ను సమపాళ్లలో మేళవించే దర్శకుడిగా పేరున్న అనిల్ రావిపూడి ఇద్దరు స్టార్ హీరోల ఇమేజ్‌కు తగ్గట్టుగా కథను సిద్ధం చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కితే టాలీవుడ్‌లోనే అత్యంత భారీ మల్టీస్టారర్‌లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో మరో మల్టీస్టారర్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ సినిమా పూర్తైన తర్వాత చిరంజీవి-నాగార్జున ప్రాజెక్ట్‌పై దృష్టి సారించే అవకాశముందని టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే చిరంజీవి, నాగార్జున, అనిల్ రావిపూడి కాంబినేషన్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తలు ప్రచారంగానే ఉన్నాయి. అధికారిక ప్రకటన వెలువడితేనే ఈ క్రేజీ మల్టీస్టారర్‌పై పూర్తి స్పష్టత రానుంది. అయినప్పటికీ ఈ వార్తతో ఇద్దరు స్టార్ హీరోల అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొనగా, ఈ కలల కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్‌కు మరో భారీ బ్లాక్‌బస్టర్ దక్కడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## పూజా హెగ్డే పెళ్లి వార్తలు..

# నిజమేనా?



**టాలీవుడ్,** బాలీవుడ్ చిత్ర పరిశ్రమల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. త్వరలోనే ఆమె పెళ్లి పీటలెక్కనున్నారంటూ బాలీవుడ్ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఇప్పటి వరకు ఈ విషయంపై పూజా హెగ్డే లేదా ఆమె కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.గత కొంతకాలంగా పూజా హెగ్డే కెరీర్ ఆశించిన స్థాయిలో సాగడం లేదనే చర్చ సినీ వర్గాల్లో వినిపిస్తోంది. కొన్ని పెద్ద సినిమాల్లో నటించినప్పటికీ ఇటీవల విడుదలైన చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపైనా దృష్టి సారించాలని పూజా నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కుటుంబ సభ్యుల సూచన మేరకు వివాహానికి ఆమె సుముఖత వ్యక్తం చేసినట్లు బాలీవుడ్ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. సమాచారం ప్రకారం, పూజా హెగ్డే కుటుంబ సభ్యులు తగిన వరుడి కోసం అన్వేషణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. వరుడు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తేనా, లేక వ్యాపార రంగానికి చెందినవారా అనే విషయంపై మాత్రం ఇంకా స్పష్టత లేదు. కుటుంబ సభ్యులు త్వరలోనే ఈ విషయంపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా పూజా హెగ్డే వ్యక్తిగత జీవితానికి సంబంధించి పలు ప్రేమ వ్యవహారాల వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే అలాంటి వార్తలన్నింటినీ ఆమె పరోక్షంగా ఖండిస్తూ తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని పలుమార్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం వినిపిస్తున్న పెళ్లి వార్తలపై కూడా అధికారిక ప్రకటన వచ్చే వరకు ఇవి కేవలం ప్రచారంగానే భావించాలని సినీ విశ్లేషకులు సూచిస్తున్నారు. పూజా హెగ్డే తన అందం, అభినయంతో తెలుగు, తమిళం, హిందీ చిత్ర పరిశ్రమల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. మహేష్ బాబు, అల్లు అర్జున్, ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి అగ్ర హీరోల సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనూ తన ప్రతిభను చాటుకుని కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఇటీవల విడుదలైన 'జన నాయకన్' చిత్రంతో మరో విజయాన్ని అందుకోవాలని పూజా హెగ్డే ఆశించినప్పటికీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. దీంతో ప్రస్తుతం ఆమె ఆశలన్నీ చేతిలో ఉన్న కొత్త ప్రాజెక్టులపైనే ఉన్నాయి. ఇప్పటికే తెలుగులో రెండు కొత్త చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ సినిమాల ద్వారా మళ్లీ విజయాల బాట పట్టాలని ఆమె భావిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, పూజా హెగ్డే పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతుండటంతో అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేకపోవడంతో ఈ వార్తలను ప్రచారంగానే చూడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే, పూజా హెగ్డే జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.

# వెంకీ అట్లూరి వ్యాఖ్యలు.. టాలీవుడ్ కల్చర్‌కు అడాప్ట్ కావాలి



ప్రస్తుతం టాలీవుడ్ ట్రెండ్ దేశవ్యాప్తంగా మార్మోగిపోతోంది. పాన్ ఇండియా సినిమాల హవాతో వివిధ సినీ పరిశ్రమలకు చెందిన నటీనటులు ఒకరి చిత్రాల్లో మరొకరు నటిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటులు టాలీవుడ్‌లో పనిచేసే విధానంపై దర్శకుడు వెంకీ అట్లూరి చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇతర పరిశ్రమల నుంచి వచ్చే నటీనటులు తెలుగు సినిమా పనితీరుకు, ఇక్కడి వర్కింగ్ కల్చర్‌కు తగ్గట్టుగా మలచుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. టాలీవుడ్ మేకింగ్ స్టైల్, వేగం, కష్టపడే తత్వం చాలా భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు వచ్చే నటీనటులు ఇక్కడి వాతావరణానికి, పనిగంటలకు అలవాటు పడటం అవసరమని వెంకీ అట్లూరి అన్నారు. తెలుగు చిత్రసీమలో పనితీరు వేగంగా సాగుతుందని, సమయపాలనను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా బాలీవుడ్ నటి రవీనా టండన్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, గతంలో తెలుగు సినిమా షూటింగ్ సమయంలో ఆమె ఎలాంటి ఇబ్బంది పడకుండా దాదాపు 14 గంటల పాటు పనిచేశారని కొనియాడారు. టాలీవుడ్ వర్కింగ్ కల్చర్‌కు నటీనటులు ఎంత త్వరగా అలవాటు పడతారనేదానికి ఇదే మంచి ఉదాహరణ అని వెంకీ అట్లూరి అన్నారు. అలాగే దీపికా పదుకొణె వంటి అగ్ర నటీనటుల పనితీరును కూడా ప్రస్తావిస్తూ, పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నప్పుడు ప్రతి పరిశ్రమలోని పని విధానానికి అనుగుణంగా మారాల్సిన అవసరం ఉంటుందని అభిప్రాయపడ్డారు. బాలీవుడ్, టాలీవుడ్ వర్కింగ్ హవర్స్, డెడికేషన్‌లో తేడాలు ఉంటాయని, వాటిని అర్థం చేసుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. దర్శకుడిగా తాను తెరకెక్కించే సినిమాల్లో నటీనటుల నుంచి పూర్తి సహకారం కోరుకుంటానని వెంకీ అట్లూరి తెలిపారు. టాలీవుడ్‌లో ప్రొడక్షన్ వేగంగా సాగుతుందని, ఇతర పరిశ్రమల నుంచి వచ్చిన నటులు కూడా తెలుగు సినిమా ప్రమాణాలకు తగ్గట్టుగా తమ పని తీరును మార్చుకుంటే దర్శకుడి పని సులభమవుతుందని పేర్కొన్నారు. అలాగే కొత్త అవకాశాలు రావాలన్నా, కెరీర్‌లో నిలదొక్కుకోవాలన్నా విజయమే ప్రధానమని అన్నారు. ప్రస్తుతం వెంకీ అట్లూరి సూర్య హీరోగా 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇది సూర్యకు తొలి స్ట్రెయిట్ తెలుగు సినిమా. ఈ చిత్రం విజయవంతమైతే సూర్య తెలుగు మార్కెట్‌పై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో ఆయన నటించిన పాన్ ఇండియా చిత్రం 'కంగువ' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com